ANN తెలుగు

Follow: @ANNTELUGU

02-06-2026

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 154 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## ఘన తెలంగాణ పుష్కరకాలం.. ప్రగతి వేగం

### పాలకులు ఎవరైనా.. తగ్గేదెలే

- దేశానికి స్ఫూర్తి.. తిరుగులేని కీర్తి
- రికార్డులు బద్దలుకొడుతున్న ధాన్యరాశులు
- లక్షల కోట్లతో విశ్వనగరంగా ఐటీ ఖిల్లా
- 3 ట్రిలియన్ డాలర్ల టార్గెట్ తో భవిష్యత్ దార్శనికత.
- ఇంటింటికీ జలాలు.. వైద్య రంగంలో సంచలనాలు.

04

జూన్ 2, 2026 నాటికి తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి విజయవంతంగా 12 వసంతాలు పూర్తి చేసుకుని నవ చరిత్రను లిఖిస్తోంది. ఆరు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం, నెత్తుటి త్యాగాల పునాదుల మీద ఉదయించిన 29వ రాష్ట్రం, నేడు అన్ని రంగాల్లో అప్రతిహత విజయాలతో యావత్ దేశానికే ఒక సజీవ దిక్సూచిగా నిలుస్తోంది. ఒకప్పుడు కరువు కాటకాలతో, నెర్రెలు బారిన నేలలతో, కరెంటు కష్టాలతో అల్లాడిన ఈ ప్రాంతం, ఈ పన్నెండేళ్లలో స్పష్టమైన దార్శనికతతో, అత్యంత పకడ్బందీ ప్రణాళికాబద్ధమైన పాలనతో అద్భుతమైన ప్రగతిని నమోదు చేసింది.

టాప్ న్యూస్

## ఏమైనా పీకగలిగితే.. డిప్యూటీ సీఎంగా అక్కడ చెయ్



- నవనిర్మాణమని రెచ్చగొడితే సహించం
- పవన్ కు మంత్రి పొన్నం హెచ్చరిక
- విద్వేష రాజకీయాలు చేస్తే ఊరుకోం

02

## ఈసారి పెట్టుకుంటే మూతి పళ్ళు రాలుతాయి



- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఫైర్
- మీకు రాజధాని కట్టుకోవడం చేతకాదు
- తెలంగాణ నవనిర్మాణం చేస్తావా?

02

## పవన్ కు పోలీసుల షాక్



గచ్చిబౌలిసభకు నో పర్మిషన్

02



వడ్లు కొనకపోతే

# జూన్ 15 తర్వాత కేంద్రంపై యుద్ధమే

### ఎట్ల కొనరో బీజేపీ ఆఫీసుల వద్దే తేల్చుకుంటాం

కాగజ్‌నగర్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆల్టిమేటం

తు ప్రయోజనాల కోసం మోదీ అయినా.. కిషన్ రెడ్డి అయినా ఎవరినీ లెక్కచేయను

తుమ్మిడిహట్టికి సహకరించకుంటే.. ఆదిలాబాద్ జిల్లా ఉప్పెనై కదులుతుంది

మహారాష్ట్ర సీఎంకు సహకరించాలని విజ్ఞప్తిచేస్తున్నా

సత్రంలో భోజనానికి నెల్లూరు పెద్దారెడ్డి రికమండేషన్ అక్కర్లేదు

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వడ్లుకొనడానికి బాధ్యత తీసుకోవాలన్న సీఎం

02



## రాక్ వెల్ ఇంటర్నేషనల్ స్కూల్

# బరితెగింపు

### జీవో 111కు తూట్లు

- జీరో అనుమతులతో బహుళ అంతస్థుల నిర్మాణాలు
- గడపదాటని టౌన్ ప్లానింగ్ అధికారులు
- లంచాలు మింగి వద్యాశాఖ అనుమతులు జారీ
- మచ్చుకైనా కనిపించని ఫైర్ సేఫ్టీ
- అగ్ని ప్రమాదాలు జరిగితే అంతే సంగతులు
- పిల్లల ప్రాణాలతో చెలగాటం
- జోనల్ కమిషనర్ స్పందించాలంటున్న స్థానికులు

02

శంషాబాద్ లో జీవో 111కు తూట్లు పొడుస్తూ రాక్ వెల్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం బరితెగింపుకు పాల్పడింది. జీరో అనుమతులతో 8.5ఎకరాల విస్తీర్ణంలో స్కూల్ నిర్మాణం సాగిస్తోంది. శంషాబాద్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు మామూళ్ళు అందడంతో కార్యాలయం గడపదాటడం లేదని, విద్యాశాఖ అధికారులు భారీ ఎత్తున లంచాలు మింగి స్కూల్ నిర్వహణ అనుమతులు జారీచేశారని బహిరంగ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం నుండి ఎలాంటి నిర్మాణ అనుమతులు లేకపోవడంతో ఫైర్ సేఫ్టీ అనుమతులు నిరాకరించినట్లు అగ్నిమాపక శాఖ అధికారి తెలిపారు. అగ్నిప్రమాదాలు జరిగితే అంతే సంగతులా? చంటిపిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతారా? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. విద్యాశాఖ నుండి అడ్డదారిలో స్కూల్ యాజమాన్యం అనుమతులు పొందారని, జోనల్ కమిషనర్ స్పందించి వాటిని రద్దుచేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## గీత కార్మికుడి ఇంట ముఖ్యమంత్రి



- తాటికల్లు రుచిచూసిన చంద్రబాబు!
- సామాన్యుడి గడప తొక్కి స్వయంగా పింఛను అందజేత
- కష్టసుఖాలపై ఆత్మీయ పలకరింపు.
- గూడు లేదని చెప్పగానే పక్కా ఇల్లు నిర్మించాలని అధికారులకు తక్షణ ఆదేశాలు.
- కాకినాడ జిల్లా చామవరంలో సీఎం పర్యటన.

03

## నిరుద్యోగులకు గుడ్‌న్యూస్



### నేడు 3 ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల

### 3800 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతి

**హైదరాబాద్, మహా :** నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై ప్రకటన చేసింది. నోటిఫికేషన్‌ల విడుదలతోపాటు పరీక్ష విధానంలో తీసుకురానున్న మార్పులపై టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం కీలక వివరాలను వెల్లడించారు. మంగళవారం ఒకేసారి 3 కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేస్తామని చెప్పారు. కంప్యూటర్ బేస్డ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

**మూడు ఉద్యోగ నోటిఫికేషన్‌లు**

రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఊపందుకోనుంది. టీజీపీఎస్సీ ద్వారా అనేక ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. నెలలో 2 నుంచి 3 నోటిఫికేషన్‌లు **మిగతా 2వ పేజీలో**



## బీజేపీకి అన్నామలై గుడ్‌బై?

- సొంత పార్టీ ఏర్పాటుకు సన్నాహాలు

02

## దేశవ్యాప్తంగా 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు

- పది రాష్ట్రాల పరిధిలోని ఖాళీలకు ఈసీ నోటిఫికేషన్
- ఈ నెల 8 వరకు నామినేషన్ల దాఖలుకు గడువు



## చార్ ధామ్... జామ్ ధామ్

- భారీగా పెరిగిన భక్తులు
- విరిగిపడుతున్న కొండచరియలు
- కంగారులో ఉత్తరాఖండ్ ప్రభుత్వం
- యాత్ర నిలిపి వేస్తారన్న ప్రచారం జోరు

03



## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు

- సిట్ విచారణకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు యెన్నం, అనిరుధ్

03

# రాక్ వెల్ ఇంటర్నేషనల్ స్కూల్ బరితెగింపు

(మహా స్పెషల్ టాస్క్ ఫోర్స్)




రంగారెడ్డి జిల్లా గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పోరేషన్ శంషాబాద్ సర్కిల్ పరిధిలోని శాతంరాయి గ్రామంలో రాక్ వెల్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం జీవో 111కు తూట్లు పొడుస్తూ అరాచకానికి తెగపడింది. ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే 8.5ఎకరాలలో భారీ ఎత్తున అక్రమ నిర్మాణాలు సాగిస్తోంది. జీవో 111లో 100గజాల జాగాలో జీ+1అంతస్తు నిర్మించాలంటే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) నిబంధనల ప్రకారం భవనం నిర్మించాల్సి ఉంటుంది. కానీ 8.5ఎకరాల చుట్టూ ప్రహరీగోడ నిబంధనలకు విరుద్ధంగా పెద్ద ఎత్తున 10 అడుగుల ఎత్తున నిర్మించి అక్రమ నిర్మాణం చేపట్టారు. వాస్తవంగా జీవో 111 నియమ నిబంధనల ప్రకారం నీటి ప్రవాహానికి అడ్డుగా చెక్ డ్యామ్ లు, ఎత్తైన రాతి కట్టడాలు, బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టరాదంటూ జీవో స్పష్టం చేస్తోంది. ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జీవోలను, చట్టాలను తుంగలో తొక్కి అక్రమార్కులు ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలను చేపట్టారంటూ బహిరంగ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జీరో పర్మిషన్లతో విద్యావ్యాపారం కొరకు భవనాలు నిర్మిస్తుంటే సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు తెలియకుండా ఉంటుందా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**విద్యాశాఖ లంచాలు మింగి అనుమతులు జారీ**

జీహెచ్ఎంసీ నుండి నిర్మాణ అనుమతులతో పాటు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందిన భవనాలకే విద్యాశాఖ అధికారులు పాఠశాలలకు అనుమతులు ఇవ్వాల్సిఉంటుంది. కానీ విద్యాశాఖ అధికారులు భారీ మొత్తంలో లంచాలు మింగి ఇంటర్నేషనల్ తోకతో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న రాక్ వెల్ స్కూల్ కు బదిలీపై వెళ్ళిన జిల్లా విద్యాశాఖ అధికారి అనుమతులు ఇచ్చినట్లు మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ చెప్పడం గమనార్హం. ఓ వైపు అగ్నిమాపక అధికారుల నుండి ఎటువంటి ఫైర్ సేఫ్టీ తీసుకోలేదని, ఫైర్ సేఫ్టీ అధికారులు పేర్కొంటున్నారు. అలాంటిది విద్యా వ్యాపారం కోసం అడ్డదారులు తొక్కుతున్న రాక్ వెల్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం విసిరిన ఎంగిలిమెతుకులకు ఆశపడి విద్యాశాఖ అధికారులు అనుమతులు ఎలా జారీచేస్తారని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. పసిపిల్లల ప్రాణాలంటే లెక్కలేదా? అగ్నిప్రమాదాలు జరిగితే పరిస్థితేంటి? పోయిన ప్రాణాలు తెచ్చిస్తారా? చేతులు కాలాక ఆకులుపట్టుకుంటే ప్రయోజనమేంటి? అంటూ సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఒక్కొక్క విద్యార్థికి లక్షలాదిరూపాయల ఫీజులతో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, ఈనెల 12 నుండి క్లాసులు మొదలవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి రాక్ వెల్ ఇంటర్నేషనల్ స్కూల్ బరితెగింపును అడ్డుకోవాలని విద్యార్థుల తల్లితండ్రులతో పాటు స్థానికులు కోరుతున్నారు.

### జోనల్ కమిషనర్ చంద్రకళ స్పందిస్తేనే



ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా రాక్ వెల్ ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో జీవో 111కు విరుద్ధంగా నిర్వహణ జరుగుతోందని, జోనల్ కమిషనర్ చంద్రకళ స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే జిల్లా విద్యాశాఖాధికారి అడ్డదారిలో స్కూల్ నిర్వహణకు పర్మిషన్ ఇచ్చారని, ఫైర్ సేఫ్టీ లేకుండా ఎలా స్కూల్ నిర్వహిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. అగ్నిప్రమాదాలు సంభవించి ప్రాణనష్టం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని, వెంటనే జోనల్ కమిషనర్ స్పందించి రాక్ వెల్ ఇంటర్నేషనల్ స్కూల్ కు అడ్డదారిలో విద్యాశాఖ పాఠశాల నిర్వహణ కొరకు జారీచేసిన అనుమతులు రద్దుచేయాలని, అలాగే స్కూల్ ను మూసివేయాలని వారు కోరుతున్నారు.



## జేబుదొంగల పట్ల జాగ్రత్త

**సీబీఎస్ఈపై రాహుల్ గాంధీ ఫైర్**
**మీ తప్పులకు.. విద్యార్థులు డబ్బు చెల్లించాలా?**

**ఢిల్లీ, మహా :** "జేబు దొంగల పట్ల జాగ్రత్తగా ఉండండి. వారు సీబీఎస్ఈలోనే కొలువు దీరారు. సీబీఎస్ఈ చేసిన పొరపాటు వల్ల మార్కులు తప్పుగా వస్తే మీకు (విద్యార్థులనుద్దేశించి) వచ్చేది ఏమిటి? ఒక బిల్లు. డిజిటల్ స్కాన్ కాపీ కోసం ఒక్కో సబ్జెక్టుకు రూ.100, రీటోటలింగ్ కోసం ఒక్కో పేపర్‌కు రూ.100, రీవాల్యుయేషన్ కోసం ఒక్కో ప్రశ్నకు రూ.25. ఒక విద్యార్థి తన సొంత జవాబు పత్రాన్ని సరిగ్గా దిద్దించుకోవడానికి రూ.2000 వరకు చెల్లించాల్సి ఉండొచ్చు. 4 లక్షల మంది విద్యార్థులు ఇలాంటి దరఖాస్తులు దాఖలు చేసినప్పుడు సీబీఎస్ఈ ఎంత సంపాదిస్తోందో ఒక్కసారి ఆలోచించండి. ఫోన్‌తో స్కాన్ చేసినప్పుడు తప్పుడు మార్కింగ్ అనేది అనివార్యంగా జరుగుతుంది. దాన్ని సరిచేయించుకోవడానికి అయ్యే ఖర్చును ఆ విద్యార్థులే భరిస్తున్నారు. తప్పు సీబీఎస్ఈది. శిక్ష విద్యార్థులది. వచ్చే ఆదాయం ప్రభుత్వానిది. విద్యను ఒక సేవా మార్గం నుంచి వ్యాపారంగా మార్చినప్పుడు తప్పులు సరికావు. అవి రెట్టింపు అవుతాయి. దానికి మన పిల్లలే అత్యధిక మూల్యం చెల్లిస్తున్నారు. " అని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# ఏమైనా పీకగలిగితే.. డిప్యూటీ సీఎంగా అక్కడ చెయ్



**కరీంనగర్, మహా :** ఏపీ ఉప ముఖ్యమంత్రిగా ఏమైనా పీకగలిగితే అక్కడ చేయి.. ఇక్కడికి వచ్చి నవ నిర్మాణ సభ పెట్టి రెచ్చగొడితే సహించడానికి ఎవ్వరూ సిద్ధంగా లేరు. తెలంగాణ ఏర్పడితే 11 రోజులు అన్నం తినని వెధవ.. నీ యాక్టింగులు అందరికీ తెలుసు అంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్ అయ్యారు. పవన్ తలపెట్టిన నవనిర్మాణసభపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ లో విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడి తెలంగాణ వాతావరణాన్ని కలుషితం చేయాలని బీజేపీతో లోపాయికారి ఒప్పందం చేసుకొని పవన్ కళ్యాణ్ ఈ నటన స్టార్ట్ చేశారు..2014 లో నేను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు పోటీ చేస్తున్నపుడు పవన్ కళ్యాణ్ ఇక్కడికి వచ్చారు.. తొడకలు తీస్తాం అని చెప్పాం. ఆంధ్రపదేశ్ ఉప ముఖ్యమంత్రి గా చేయలేనిది ఇక్కడికి వచ్చి నవ నిర్మాణ సభ పెడితే ఎవరు వినడానికి సిద్ధంగా లేరు. తెలంగాణ ఏర్పడితే 11 రోజులు అన్నం తినను అన్న వెధవ వచ్చి.. ఇక్కడ తెలంగాణ పట్ల మొసలి కన్నీరు కారిస్తే ఒప్పుకోము.. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తరువాతనే నవ నిర్మాణ సభ పెట్టుకోవాలి. తెలంగాణ అస్థిత్వం,ఆత్మగౌరవం దెబ్బతీసేలా మాట్లాడిన పవన్ కళ్యాణ్ బీజేపీ ఎజెండా మోస్తున్నారు. తెలంగాణ మీద విషం కక్కి తెలంగాణ ప్రజల చూపు పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని చెప్పిన పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి. తెలంగాణ ఏర్పడితే 11 రోజులు అన్నం మానేసినా అని బహిరంగంగా చెప్పిన వ్యక్తి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొంటే మాకు అభ్యంతరం లేదు కానీ ఇక్కడ నవ నిర్మాణ సభ పెడితే తీవ్ర ఆక్షేపిస్తున్నాం. కన్న తల్లికి గాజులు కొనలేని వాడు పిన తల్లి కి ఒడ్డాణం చేస్తారని సామెత ఉంది.. కూట్ల రాయి తీయలేని వాడు..ఏట్ల రాయి తీస్తాడా. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలనుకుంటే ఎవరైనా పాల్గొనచ్చు. ఆంధ్రపదేశ్ ఉప ముఖ్యమంత్రి గా చేయలేనిది ఇక్కడికి వచ్చి నవ నిర్మాణ సభ పెడితే ఎవరు వినడానికి సిద్దంగా లేరు.

మాకు అస్సాం కంటే ఆంధ్రప్రదేశ్ దగ్గర.. ఆంధ్రప్రదేశ్ తో సంత్సంబంధాలు ఉండాలని కోరుకుంటాం. తెలంగాణ ఏర్పడితే 11 రోజులు అన్నం తినలేదని అన్న దానికి సమాధానం చెప్పు. తెలంగాణ కోసం పార్లమెంట్ సభ్యుడిగా ,సకల జనుల సమ్మె ద్వారా తెలంగాణ కోసం పోరాటం చేసినం. తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ,పోరాట యోధులను గుర్తించాలని ప్రభుత్వం కమిటీ వేసి ముందుకు పోతుంది.. వారిని గుర్తించి గౌరవించాలని ప్రభుత్వం కార్యక్రమం చేస్తుంది. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడిన ఆయన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు ఇక్కడే ఎందుకు సభ పెడుతున్నారు. నవ నిర్మాణ సభ గుజరాత్ ,కేరళ , ఉత్తర ప్రదేశ్ ,తమిళనాడు లో ఎందుకు పెట్టడం లేదు. బీజేపీ డైరెక్షన్ లో తెలంగాణ లో విద్వేషాలు రెచ్చగొట్టి వైషమ్యాలు రెచ్చగొట్టేలా చేస్తే ఊరుకోరు. హైదరాబాదులో పవన్ కళ్యాణ్ నవనిర్మాణ సభ పేరు వెనుక ఆంతర్యం ఏమిటి.? బిజెపికి తెలంగాణను తాకట్టు పెట్టడమే మీరు స్థాపించే నవనిర్మాణమా? మీకు ఏపీ ప్రజలు ఆశీర్వదించి అధికారం ఇచ్చారు. అక్కడ చూయించండి మీ నవనిర్మాణము. పవన్ కళ్యాణ్ నవనిర్మాణ సభలు బిజెపి పాలిత గుజరాత్ మధ్యప్రదేశ్ లో ఉత్తర ప్రదేశ్ లో ఎందుకు ఏర్పాటు చేయడం లేదు? మీ బాస్ మోదీ ను మెప్పించడానికి తెలంగాణ లో సభ పెడుతున్నారా..? తెలంగాణలో సభ ఏర్పాటు చేయాలి. నాలుగు రెచ్చగొట్టే మాటలు మాట్లాడాలి. ఇక్కడ జనాలు తన్నుకు చావాలి . ఇదేనా మీ పవనిజం? అణువణువునా తెలంగాణ వ్యతిరేక తను నింపుకున్న పవన్ కళ్యాణ్ మొదట తెలంగాణ వాదులకు క్షమాపణ చెప్పాలి. తెలంగాణ ద్వేషి పవన్ కళ్యాణ్. ఇక్కడ విద్వేష రాజకీయాలు చేస్తామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# ఈసారి పెట్టుకుంటే మూతి పళ్ళు రాలుతాయి



**హైదరాబాద్, మహా** ఇదివరకు ఒకసారి మాతో పెట్టుకున్నారు.. రాష్ట్రం వచ్చింది.. ఈసారి పెట్టుకుంటే మూతి పళ్ళు రాలుతాయి. మీకు రాజధాని కట్టుకోవడం చేతకాదు తెలంగాణ నవనిర్మాణం చేస్తావా? మా పని మేము చేసుకుంటాం.. ముందు మీ పని చూసుకోండి అంటూ టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఫైర్ అయ్యారు. తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు 'సాధన' అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రం ఏర్పడి 13 ఏళ్లు కావస్తున్నా ఆంధ్రా నేతలకు రాజధాని కట్టుకోవడం చేతకాక, ప్రజల దృష్టిని మళ్లించడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీలో కాకుండా పార్లమెంట్‌లో అమరావతిపై తీర్మానం చేయించుకున్నారని, 'మావిగన్' పేరుతో జగన్ వీరికి రాజకీయ బాంబు వేశారని ఎద్దేవా చేశారు. "పవన్ కళ్యాణ్ తెలంగాణలో నవ నిర్మాణ సభ పెట్టేముందు, లోకేష్ బాబు మీ సెక్రటేరియట్‌లోకి వాన నీళ్లు రాకుండా చూసుకోండి. ప్రతి వానాకాలం మీ రాజధాని మునుగుతుంటే ఆంధ్రా ప్రజలకు ఎంత అవమానం? ఇప్పటికీ ఏపీ ప్రజలకు వైద్య సదుపాయాలు కల్పించలేక నెల్లూరు వాళ్లు చెన్నైకి, అనంతపురం వాళ్లు బెంగళూరుకు, విజయవాడ వాళ్లు హైదరాబాద్‌కు రావాల్సిన పరిస్థితి ఎందుకు కల్పించారు?" అని ప్రశ్నించారు. తెలంగాణలో ఎక్స్‌టెన్షన్ కావడానికి ఇది మీ సామ్రాజ్యం కాదని, ఆంధ్రా పార్టీలకు ఇక్కడి ప్రజలు ఓట్లేయరనే దుకాణం బంద్ చేసుకున్న విషయం లోకేష్ బాబు గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణలో వ్యాపారాలు, షూటింగ్‌లు చేసుకునే వారికి తాము ఎప్పుడూ రెడ్ కార్పెట్ పరుస్తామని, ఇక్కడ స్థిరపడిన ఆంధ్రా ప్రజలందరినీ కడుపులో పెట్టుకుని చూసుకుంటామని కవిత స్పష్టం చేశారు. అయితే మా నీళ్లు, మా రాజకీయాల్లో వేలు పెడితే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. "నేను అసలే మొండి దాన్ని, మీరు అనుకున్నంత మంచిదాన్ని కాదు. మేము అధికారంలోకి రాగానే ఇక్కడున్న ఆంధ్రా నాయకుల విగ్రహాలను పగలగొట్టి ఆంధ్రాకు పార్సల్ చేస్తాం" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'టీఆర్ఎస్ 2.0'తో పెట్టుకుంటే మూతి పళ్లు రాలుతాయని, ఒకసారి పెట్టుకుంటేనే తెలంగాణ తెచ్చుకున్నామని, మాతో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

# దేశవ్యాప్తంగా 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు

**ఢిల్లీ, మహా :** దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న రాజ్యసభ (పెద్దల సభ) స్థానాల భర్తీకి కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) లాంఛనంగా ఎన్నికల నగారా మోగించింది. మొత్తం 10 రాష్ట్రాల పరిధిలోని 27 రాజ్యసభ స్థానాలకు సోమవారం అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం తాజా ప్రకటనతో ఆయా రాష్ట్రాల్లో అప్పుడే రాజకీయ సందడి మొదలైంది. చట్టసభల్లో తమ వాణిని బలంగా వినిపించేందుకు, కీలక బిల్లుల ఆమోదానికి రాజ్యసభలో సంఖ్యాబలం అత్యంత కీలకం కావడంతో.. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. ఎన్నికల సంఘం విడుదల చేసిన తాజా షెడ్యూల్ ప్రకారం.. నోటిఫికేషన్ వెలువడిన నేటి నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ లాంఛనంగా ప్రారంభమైంది. ఆశావహులు, వివిధ రాజకీయ పార్టీలు ఖరారు చేసిన అభ్యర్థులు ఈ నెల 8వ తేదీ వరకు తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. నామినేషన్ల స్వీకరణ గడువు ముగిసిన తర్వాత.. పత్రాల పరిశీలన, ఉపసంహరణ ఘట్టాలు ముగియనున్నాయి. అనంతరం బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. పోటీ అనివార్యమైన స్థానాలకు ఈ నెల 18వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. ఆయా రాష్ట్రాల శాసనసభల ప్రాంగణాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శాసనసభ్యులు (ఎమ్మెల్యేలు) తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే, అదే రోజు (18వ తేదీ) సాయంత్రం 5 గంటలకు కట్టుదిట్టమైన భద్రత నడుమ ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించి, రాత్రి కల్లా విజేతలను అధికారికంగా ప్రకటించనున్నారు.

# బీజేపీకి అన్నామలై గుడ్‌బై? సొంత పార్టీ ఏర్పాటుకు సన్నాహాలు



చెన్నై , మహా : తమిళనాడు రాజకీయాల్లో ఇప్పుడు ఒకటే ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. రాష్ట్రంలో ద్రావిడ పార్టీలకు ధీటుగా బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసిన మాజీ ఐపీఎస్ అధికారి, రాష్ట్ర భాజపా మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై త్వరబలోనే కమలం పార్టీని వీడనున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఆయన సొంతంగా ఒక కొత్త రాజకీయ పార్టీని స్థాపించే దిశగా అడుగులు వేస్తున్నారని రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. భాజపా సమావేశాలకు హాజరుకాకుండా అన్నామలై విదేశీ పర్యటనకు వెళ్ళగా, సరిగ్గా ఇదే సమయంలో కోయంబత్తూరు నగరమంతటా ఆయన మద్దతుదారులు భారీ ఎత్తున పోస్టర్లు ఏర్పాటు చేశారు. ''భయం లేని మనసులకు హద్దులు లేవు'' అనే అర్థం వచ్చేలా ముద్రించిన ఈ పోస్టర్లు చర్చనీయాంశంగా మారాయి. మరోవైపు, ఆయన అభిమాన సంఘం 'అన్నామలై అన్బు కూట్టం' రాష్ట్ర వ్యాప్తంగా కొత్త సభ్యులను, కార్యకర్తలను చేర్చుకునే పనిని ముమ్మరం చేసింది. సామాజిక మాధ్యమాల్లో సైతం ఆయన మద్దతుదారులు కొత్త పార్టీ పేరు, జెండా డిజైన్ల గురించి బహిరంగంగానే చర్చిస్తుండటం, అభిప్రాయాలు సేకరిస్తుండటం విశేషం. దళపతి విజయ్ రాజకీయాల్లోకి వచ్చి సంచలనం సృష్టిస్తున్న తరహాలోనే అన్నామలై సైతం తనదైన ముద్ర వేయాలని భావిస్తున్నట్లు సమాచారం. తమిళనాట జరుగుతున్న ఈ పొలిటికల్ డ్రామాపై కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా చేసిన పోస్ట్ మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ''తమిళనాడులో త్వరలోనే మరో కొత్త రాజకీయ పార్టీ పురుడు పోసుకోబోతోంది. రాజకీయ మథనం మరింత వేగవంతమైంది'' అని ఆయన అందులో పేర్కొన్నారు. అన్నామలై పెట్టబోయే పార్టీ పేరు వెనుక ఆసక్తికరమైన లాజిక్ ఉందంటూ ఆయన పరోక్షంగా హింట్ ఇచ్చారు.



# పవన్‌కు పోలీసుల షాక్

**గచ్చిబౌలిసభకు నో పర్మిషన్**

**హైదరాబాద్, మహా :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు తెలంగాణ పోలీసులు షాక్ ఇచ్చారు. గచ్చిబౌలిలో జనసేన చేపట్టబోయే తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభకు పర్మిషన్ నిరాకరించారు. ఈ మేరకు జనసేన నాయకులకు నోటీసులు జారీ చేశారు. . పోలీసుల నిర్ణయాన్ని సవాలు చేస్తూ తెలంగాణ జనసేన పార్టీ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు ఏపీ డిప్యూటీ సీఎం నిర్వహించే రాజకీయ సభ ద్వారా తెలంగాణలో అశాంతి, ఘర్షణలు చోటుచేసుకునే ప్రమాదముందని పోలీసులు అనుమతి నిరాకరించినట్లు తెలుస్తోంది. శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున్న పర్మిషన్ ఇవ్వడం లేదని పోలీసులు చెబుతున్నారు. అలాగే సభకు సుమారు 2 వేల మందికి పైగా హాజరయ్యే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందని చెబుతున్నారు.




# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

( మొదటి పేజీ తరువాయి )

విడుదల చేస్తామన్నారు. మంగళవారం ఒకేసారి 3 కొత్త ఉద్యోగ ప్రకటనలిస్తామన్నారు. ఇప్పటికే వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న సుమారు 3800 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతి ఇచ్చిందని తెలిపారు. టీజీపీఎస్సీలో ప్రస్తుతం 28 రకాల పోస్టులకు ఒక్కో ఖాళీ ఉందని, మరో 25 రకాల పోస్టుల్లో 5 కంటే తక్కువ ఖాళీలున్నాయని వివరించారు. ఈ నెలలో 5 నుంచి 6 నోటిఫికేషన్లు విడుదల చేసే యోచనలో ఉన్నట్లు బుర్రా వెంకటేశం తెలిపారు

# ఇచ్చిన హామీలు అమలు చేయలేక అరెస్టుల

మందమర్రి, మహా : కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుtత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేక అక్రమ అరెస్టులకు పాల్పడుతుందని భారత రాష్ట్ర సమితి నాయకులు విమర్శించారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసిఫాబాద్ జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా మమ్మల్ని అక్రమ అరెస్టు చేయడం సిగ్గు చేయడానికి అన్నారు. వీరికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికలలో ఇచ్చిన హామీలు 6 గ్యారంటీలు,,420 హామీల అమలు చేయాలని సవాలు విసిరారు.ప్రజల దృష్టిని మళ్లించడానికి విపాక్షాలపై కక్ష సాధింపులు పోలీస్ వ్యవస్థను రాజకీయ అవసరాలకు వాడుకోవడం నిలుపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఫీజు రియంబర్స్ మెంట్ సమస్యతో వేలాదిమంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ లో ఉన్న ఫీజ్ రియంబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ ఆయన వారిలో మందమర్రి మండలం, పట్టణం బిఆర్ఎస్ నాయకులు, ఏల్పుల రవీందర్, లౌడం రాజు కుమార్, ఎండి ఫిరోజ్, సది, తోట సురేందర్, దాసరి నవీన్, సీపెల్లి సాగర్, మాసు వెంకటేష్, అందే శ్రీకాంత్, ఎండి పాషా నాయకులుపాల్గొన్నారు.

# వడ్లు కొనకపోతే జూన్ 15 తర్వాత కేంద్రంపై యుద్ధమే



**ఆసిఫాబాద్, మహా :** రాష్ట్రంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన పంటను కేంద్రం తీసుకోకపోతే జూన్ 15 తర్వాత బీజేపీ ఆఫీసు వద్దే తాడోపేడో తేల్చుకుంటామని, ఎట్లకొనరో చూస్తామని సీఎం రేవంత్ రెడ్డి మాస్ వార్నింగ్ ఇచ్చారు. సోమవారం కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించిన ఆయన రూ.112.14 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కొఠారి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొని అక్కడే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితుల్లోనూ తుమ్మడిహెట్టి బ్యారేజీని నిర్మించి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. దీనిపై తాము ఏడాది కాలంగా ప్రయత్నిస్తున్నామని, మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే తాము ఎన్ని లేఖలు రాసినా మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ నుంచి కనీస స్పందన, గౌరవం లభించడం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మహారాష్ట్ర సీఎం చీకటి మిత్రుడైన కేసీఆర్‌కో, ప్రధాని మోదీకో తాను నచ్చకపోవడం వల్లే ఇలా నిర్లక్ష్యం చేస్తున్నారేమోనని కామెంట్ చేశారు. రబీ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన వడ్లు కొనకపోతే జూన్ 15 తర్వాత కేంద్రంపై యుద్ధమేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఇందిరమ్మ ఇల్లు మహిళ ఆత్మగౌరవమన్న సీఎం.. గూడెల్లో ఉన్న పేదలకు 21 వేల ఇందిరమ్మ ఇళ్లను కేటాయించామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇల్లు ఇంకా పూర్తిస్థాయిలో రాలేదని కొందరు చెప్పారని.. తండాలు, గూడెల్లో ఉన్న ఆదివాసీలకు వందకు వంద శాతం ఇల్లు ఇవ్వాలని ఆదేశాలిస్తున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని స్పష్టం చేశారు.

**ఆదిలాబాద్ జిల్లా ఉప్పెనై కదులుతుంది**

ఒకవేళ మహారాష్ట్ర ప్రభుత్వం తుమ్మడిహెట్టిపై స్పందించకపోతే ఆదిలాబాద్ ప్రజలు ఉప్పెనలా ఎగసిపడతారని, ఆదిలాబాద్ కదిలితే మహారాష్ట్రకే నష్టమని హెచ్చరించారు. నాడు పోలవరం ప్రాజెక్టు కోసం ఏడు మండలాలను కలిపిన విషయాన్ని గుర్తుచేస్తూ, నేడు తుమ్మడిహెట్టి కోసం మహారాష్ట్ర 2 వేల ఎకరాల భూమిని ఇవ్వలేదా అని ప్రశ్నించారు. ఈ విషయంలో మహారాష్ట్ర సీఎం సమావేశానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు. గత పాలకులు తుమ్మడిహెట్టిని పక్కన పెట్టేసి, లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరాన్ని కూలేశ్వరంగా మార్చారని ముఖ్యమంత్రి విమర్శించారు. తుమ్మడిహెట్టిని నిర్మిస్తే ఎలాంటి లిఫ్టుల అవసరం లేకుండా, కేవలం గ్రావిటీ ద్వారానే నీళ్లు అందుతాయని, రైతుల సమస్యల విషయంలో తాము ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గబోమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

నెల్లూరు పెద్దారెడ్డి రికమండేషన్ అక్కర్లేదు రాష్ట్రంలో రైతుల నుంచి ఇప్పటికే 75 లక్షల క్వింటాళ్ల వడ్లు, 40 లక్షల క్వింటాళ్ల మొక్కజొన్నలను కొనుగోలు చేస్తున్నామని, ఆ ధాన్యాన్ని కేంద్రం వెంటనే సేకరించాలని సీఎం రేవంత్ డిమాండ్ చేశారు. 'సత్రంలో పెట్టే భోజనానికి నెల్లూరు పెద్దారెడ్డి రికమండేషన్ అవసరం లేదు' అంటూ కిషన్ రెడ్డిపై సెటైర్లు వేసిన సీఎం, రాష్ట్ర ప్రభుత్వం కొనే పంటను కేంద్రం తీసుకునేలా ఆయన బాధ్యత వహించాలని అన్నారు. ఒకవేళ కేంద్రం గనుక ఈ పంటను తీసుకోకపోతే, జూన్ 15 తర్వాత హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయం వద్దే తేల్చుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. సభలో మంత్రులు జూపల్లి క్రిష్ణారావు, వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, ఎంపీగడ్డం వంశీక్రిష్ణ, ఎమ్మెల్యేలు ప్రేమ్ సాగర్ రావు, వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ దండె విఠల్, ఇతర ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, హరీష్, స్థానిక నేతలు శ్యాంనాయక్, శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.



# గీత కార్మికుడి ఇంట ముఖ్యమంత్రి

కాకినాడ, మహా :రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాన్యులతో మమేకమవుతూ పాలనలో తనదైన ముద్ర వేస్తున్నారు. 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయికి వెళ్లి అట్టడుగు వర్గాల ప్రజల కష్టనష్టాలను స్వయంగా తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలో సోమవారం కాకినాడ జిల్లా, తుని నియోజకవర్గంలోని చామవరం గ్రామంలో పర్యటించిన ఆయన.. ఒక సామాన్య కల్లుగీత కార్మికుడి ఇంటికి వెళ్లి ఆత్మీయంగా పలకరించారు. పోలరపు సింహాచలం అనే గీత కార్మికుడి నివాసానికి ముఖ్యమంత్రి స్వయంగా నడుచుకుంటూ వెళ్లి, ఆయనకు ప్రతి నెలా రావాల్సిన సామాజిక పింఛనును నేరుగా చేతికి అందించి ఆశ్చర్యపరిచారు. రాష్ట్ర అధినేత ఏకంగా తమ గడప తొక్కి, ఆత్మీయంగా మాట్లాడి పింఛను డబ్బులు ఇవ్వడంతో ఆ కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

**గీత కార్మికుల కష్టాలపై ఆరా.. ఇంటి మంజూరు**

పింఛను అందజేసిన అనంతరం సింహాచలం కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి కొద్దిసేపు కూర్చుని ముచ్చటించారు. వారి జీవన విధానం, రోజువారీ ఆదాయ వ్యయాల గురించి సానుభూతితో ఆరా తీశారు. ప్రాణాలకు తెగించి అత్యంత శ్రమతో చేసే కల్లుగీత వృత్తిలోని సాధకబాధకాలు, ఎదుర్కొంటున్న కష్టనష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఆత్మీయ సంభాషణల క్రమంలో.. తమకు సొంత గూడు లేదని, ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సింహాచలం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై తక్షణమే స్పందించిన చంద్రబాబు.. ఆ కుటుంబానికి వెంటనే ఒక పక్కా ఇల్లు మంజూరు చేసి, నిర్మించి ఇవ్వాలని అక్కడే ఉన్న జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించారు.



ముఖ్యమంత్రి అప్పటికప్పుడే ఇల్లు మంజూరు చేయడంతో ఆ గీత కార్మికుడి కుటుంబం ఉద్వేగానికి లోనై చేతులెత్తి కృతజ్ఞతలు తెలిపింది.

**తాటికల్లు రుచిచూసి.. ఆత్మీయత చాటి..**

ఈ పర్యటనలో భాగంగా గీత కార్మికుల వృత్తిగత నైపుణ్యాలను ముఖ్యమంత్రి ఆసక్తిగా తిలకించారు. తాటి చెట్టు నుంచి కల్లు తీసే విధానాన్ని సింహాచలం వివరిస్తుండగా చంద్రబాబు సావధానంగా విన్నారు. అనంతరం గీత కార్మికులు ఎంతో ప్రేమతో అందించిన, అప్పుడే తీసిన స్వచ్ఛమైన తాజా తాటి కల్లును ముఖ్యమంత్రి ఆస్వాదించారు. ఒక సామాన్యుడిలా వారితో కలిసిపోయి తాటికల్లు రుచిచూడటం అక్కడున్న వారందరినీ ఆకట్టుకుంది. అనంతరం ఈ గ్రామ పర్యటనకు సంబంధించిన ఆత్మీయ క్షణాలను, ఫొటోలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా ద్వారా రాష్ట్ర ప్రజలతో పంచుకున్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి, పేద ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా మరోసారి స్పష్టం చేశారు.



# కాంగ్రెస్ లో భారీ చేరికలు

- 18, 19 వ వార్డు నుండి తరలివచ్చిన కాలనీ వాసులు
- కండువాలు కప్పి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** పేదలకు సేవ చేయడానికే తాను రాజకీయాల్లోకి వచ్చినట్టు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం పట్టనంలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన చేరికల కార్యక్రమానికి హాజరయ్యారు. కౌన్సిలర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో18 వార్డు రణదివే నగర్ నుండి జమునబాయి ఆధ్వర్యంలో 19 వ వార్డు హైమద్ నగర్ నుండి పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు కాంగ్రెస్ లో చేరేందుకు తరలివచ్చారు. వారందరికి కంది శ్రీనివాస రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు ఇంత పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ లో చేరినందుకు సంతోషంగా ఉందన్నారు. తాను అందరికి ఉపయోగ పడే పనే చేస్తానని అన్నారు.అందరి బంధువుగా ఆదిలాబాద్ ప్రజల కు సేవ చేస్తున్నానన్నారు . డబ్బుల సంపాదన కోసం రాలేదని అన్నారు. ఏ పదవి లేకున్నా ప్రజల కోసం ఇంత పెద్ద ఆఫీస్ ఏర్పాటు చేసానని తెలిపారు. గత ఎన్నికల్లో తక్కువ మెజారిటీతో ఓడినానని,మీ అందరి ఆశీర్వాదంతో ఇరవై ఏళ్లల్లో ఏ కాంగ్రెస్ అభ్యర్థికి రానన్ని ఓట్లు వేసారని అన్నారు. ఓడినప్పటికి నిత్యం ప్రజల్లోనే ఉంటున్నానన్నారు. గెలిచినా ఓడినా ఎల్లప్పుడు ప్రజలతోనే ఉంటాన్నారు. కబ్జాలు చేస్తూ అవినీతీ చేసే ఎమ్మెల్యే పాయల్ ను గరీబోళ్ల పక్షాన నిలబడి ప్రశ్నిస్తున్నానన్నారు. రెండున్నరేళ్లలో ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఆయన చేసిందేమీ లేదన్నారు. ఆదిలాబాద్ ప్రజలను దోచుకుంటున్నాడని అన్నారు. బీజేపీ కి చెందిన ఎంపీ ఎమ్మెల్యేను గెలిపిస్తే ఏంచేసారని ప్రశ్నించారు. మీవద్దకు వస్తే మాకోసం ఏం చేసావని ఎంపీ ఎమ్మెల్యేను నిలదీయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లతో పాటు పేదలకు అండగా పని చేస్తుందని కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. బీజేపీ ఓట్లు తొలగించే కుట్ర పన్నుతుందని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదం తనకు కావాలని కోరారు. ప్రజలు కాంగ్రెస్ ను గెలిపించాలని కోరారు. మీరు గెలిపిస్తే మీ బిడ్డలాగా పని చేస్తానన్నారు. ఆదిలాబద్ లో అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తానన్నారు. ఎన్నికేదైనా గెలుపే లక్ష్యంగా పని చేద్దామని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, కొండ గంగాధర్ , లోక ప్రవీణ్ రెడ్డి, సింగిరెడ్డి రాంరెడ్డి, శ్రీలేఖ , అల్చెట్టి నాగన్న, రాములు, అశోక్, నరేష్ , జుబేదా , ప్రశాంత్ , బోనగిరి సంటెన్న తదితరులు పాల్గొన్నారు..



# కంది శ్రీనివాస రెడ్డి పరామర్శ

**ఆదిలాబాద్ మహా :** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని 34వ వార్డు మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దారవేణి సత్యనారాయణ నివాసాన్ని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సందర్శించారు. సత్యనారాయణ చిత్ర పటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయ వెంట ఆత్మ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, కొండ గంగాధర్ , లోక ప్రవీణ్ రెడ్డి,అల్చెట్టి నాగన్న,శాంతన్ రావు, ఎంఎ షకీల్, అఫ్రోజ్, డేరా కృష్ణారెడ్డి , నరేష్ రెడ్డి , ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

# చార్ ధామ్... జామ్ ధామ్

**భారీగా పెరిగిన భక్తులు**
**విరిగిపడుతున్న కొండచరియలు**
**కంగారులో ఉత్తరాఖండ్ ప్రభుత్వం**
**యాత్ర నిలిపి వేస్తారన్న ప్రచారం జోరు**






**డెహరాడూన్, మహా :** చార్ ధామ్ యాత్ర. ఒక్కసారైనా జీవితంలో గంగోత్రి, యమునోత్రి, కేదార్ నాథ్, భద్రీనాథ్ ఆలయాలను దర్శించుకుని జన్మ ధన్యం చేసుకోవాలని ప్రతి హిందూ భావిస్తుంటారు. ఏడాదిలో కేవలం నాలుగు మాసాలే ఈ నాలుగు పుణ్యక్షేత్రాలను దర్శించుకునే అవకాశం లభిస్తుంది. హిమాలయ పర్వత శ్రేణులకు అతి సమీపంలో ఉన్న దేవాలయాలను దర్శించుకోవడం అంటే పెద్ద సాహసం చేయడమే అని గతంలో చేసుకునే వారు. కానీ కాల క్రమేణా రవాణా సౌకర్యాలు పెరగడం, రోడ్డు మార్గంలోనే కాకుండా హెలీ కాప్టర్ సేవలు కూడా అందుబాటులోకి రావడంతో చార్ ధామ్ యాత్రకు ఏటేటా భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ ఏడాది మే నెల మొదటి వారంలో యాత్ర ప్రారంభం నుంచి భక్తుల రద్దీ తీవ్రమైంది. యాత్రకు భక్తులు పోటెత్తడంతో బద్రీనాథ్.. కేదార్ నాథ్ ఆలయ మార్గాలు కిటకిట లాడుతున్నాయి. ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ తో దారిలోనే యాత్రికులు పడిగాపులు కాయల్సిన పరిస్థితి నెలకొంది. గమ్యస్థానం ఎప్పుడు చేరతామో.. దైవాన్ని ఎప్పుడూ దర్శించుకుంటామో తెలియని స్థితిలో ఆందోళన చెందుతున్నారు.

కేదార్ నాథ్ నడక మార్గంలో అడుగు వేయడానికి కూడా వీలు లేనంత రద్దీ నెలకొంది. ఇక బద్రీనాథ్ కు వెళ్లే మార్గంలో జోషీ మఠ్ వద్ద దాదాపు ముప్పై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో యాత్రికులు గంటల తరబడి వాహనాల్లోనే గడపాల్సి పరిస్థితి నెలకొంది. ఇందుకు తోడుగా యాత్ర మార్గంలో భారీగా కొండ చరియలు విరిగి పడుతుండటంతో భద్రతా సిబ్బంది ఎక్కడికక్కడ పరిస్థితిని అంచనా వేస్తూ వాహనాల రాకపోకలకు అనుమతిస్తున్నారు. కొన్ని సందర్భాలలో అయితే యాత్రికులు ఎలాంటి సౌకర్యాలు లేని చోట్ల చిక్కుకుపోతుండటంతో ఉత్తరాఖండ్ ప్రభుత్వాధికారులు కంగారు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక వైపు యాత్రికుల సంఖ్య పెరగడం, మరో వైపు భారీగా కొండ చరియలు విరిగి పడుతుండటంతో ఈ సారి యాత్ర ముగిసే వరకు ఎలాంటి దుర్వార్తలు వినాల్సి వస్తుందో అన్న కంగారు ఉత్తరాఖండ్ ప్రభుత్వంలో నెలకొంది. యాత్రికుల సౌకర్యార్థం అధికారులు గత ఏడాది కంటే భారీ స్థాయిలో ఏర్పాట్లు చేసినప్పటికీ ప్రకృతి ప్రకోపం, పెరుగుతున్న యాత్రికుల నేపథ్యంలో కొంత ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయని అక్కడి ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. నిత్యం ఏదో ఒక చోట కొండ చరియ విరిగిపడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలవుతుండటంతో భక్తుల్లోనూ కొంత అభద్రతాభావం నెలకొంది. అయినప్పటికీ జీవితకాల స్వప్నం చార్ ధామ్ దర్శనం కోసం సాహసం చేస్తూనే ఉన్నారు. అయితే భక్తుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ కొంత కాలం చార్ ధామ్ యాత్రకు ఫుల్ స్టాప్ పెడితే ఎలా ఉంటుందన్న విషయాన్ని ఉత్తరాఖండ్ ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. కొత్తగా యాత్రకు రావాలనుకునే వారు ప్రయాణాలను రద్దు చేసుకోవాలని అవస్థలు ఇప్పటికే యాత్ర మధ్య ఉండి పడుతున్న భక్తులు సూచిస్తున్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు

**సిట్ విచారణకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు యెన్నం, అనిరుధ్**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించిన 'ఫోన్ ట్యాపింగ్' కేసు విచారణలో మంగళవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తమ ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారంటూ అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు శాసనసభ్యులు గతంలో చేసిన ఫిర్యాదుల నేపథ్యంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జనంపల్లి అనిరుధ్ రెడ్డిలకు సిట్ సీఆర్పీసీ సెక్షన్ 160 కింద నోటీసులు జారీ చేసి, బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వాంగ్మూలం రికార్డు చేశారు. ఈ వ్యవహారంపై సిట్ అధికారులు వారి నుంచి పూర్తి స్థాయి వివరాలను సేకరించారు.




# రాష్ట్రంలో గుడిసె కనిపించవద్దు

**ఆసిఫాబాద్ పర్యటనలో సీయం రేవంత్ రెడ్డి**



**ఆదిలాబాద్ మహా:** రాష్ట్రంలో ఇల్లులేని పేదలు ఉండకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు కార్యక్రమం ప్రవేశపెట్టిందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొలం కొఠారి జీపీలోని కొత్తగూడ లో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలలో ఆయన గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి , ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి సీతక్క, గనుల శాఖా మంత్రి వివేక్ వెంకట స్వామి స్థానిక ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే కోవా లక్ష్మి జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు.ఆయనకు ఆదివాసీ సాంప్రదాయాలతో ఘన స్వాగతం లభించింది. ముందుగా ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు ఆత్రం పోసు బాయి , టేకం పగ్గు బాయి ఇండ్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. లబ్దిదారులకు స్వీట్ తినిపించి నూతన వస్త్రాలు బహుకరించారు.అనంతరం అన్ని కాలాల్లో తట్టుకనే సియర్ వాల్ అనే నూతన టెక్నాలజీతో నిర్మిస్తున్న ఇంటిని పరిశీలించారు. కిందనే కూర్చుని ఆదివాసీలతో మచ్చటించారు. ప్రభత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని అడగి తెలుసుకున్నారు. సీయం మాట్లాడుతూ.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అత్యంత వెనుకబడిన ప్రాంత మన్నచర్చ ఉందని అందుకే ప్రభుత్వ పథకాలలో ఆదిలాబాద్ కు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రాంతానికి అధిక నిధులు కేటాయించి అభివృద్ధి పరిచి ఆదివాసీ జీవితాలలో వెలుగులు చూడాలన్న ధ్యేయంతో ప్రభుత్వం ఉందన్నారు.ఇందిరమ్మ ఇండ్ల ద్వారా తొలివిడతలో ప్రతీ నియోజక వర్గానికి 3500 ఇండ్లు చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4లక్షల 50 వేల ఇండ్లు పేదలకు ఇచ్చామన్నారు. ఆదివాసీల కోరిక మేరకు ఐటీడీఏ గూడాలకు అదనంగా 21వేలు ఇండ్లు కేటాయించి ఆదివాసీ కుటుంబాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. పేదలకు పక్కా ఇళ్లు ఉండాలన్న లక్ష్యం తో ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లా నుండే రెండోవిడత కు శ్రీకారం చుట్టామన్నారు. తొలి విడతలో ఇవాళ మొత్తం లక్ష ఇండ్లను పేదోళ్లు ప్రారంభించుకున్నారన్నారు,.

వచ్చే సంవత్సరం మరింత సంఖ్య పెంచి రెండున్నరల లక్షల ఇండ్లు ఇచ్చే విధంగా కార్యాచరణ చేపడతామన్నారు. రాష్ట్రంలో ఏ మూలనా గుడిసె కనిపించవద్దన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వచ్చే సంవత్సరం ఇదే తారీఖున పెద్ద ఎత్తున ఇండ్లు ప్రారంభించుకుందామన్నారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా ప్రతీ పేదవానికి ఇండ్లు ఇచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

ప్రభుత్వం పేదోళ్ల కోసమే ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం , ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తీసుకువచ్చిందన్నారు. అందరూ సన్నబియ్యం తింటున్నారా ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆదివాసీలు తమ పిల్లలను చక్కగా చదివించి ప్రయోజకులను చేయాలని కోరారు. భవిష్యత్తులో చదువొక్కటే ఎదగడానికి దారి చూపుతుందన్నారు.



పిల్లల చదవులకు నాణ్యమైన విద్య అందించేలక్ష్యం తో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పిల్లల చదువుపై శ్రద్ధ చూపాలన్నారు.పిల్లలందరిరీ బాగా చదవిస్తామని మహిళల దగ్గరనుండి మాట తీసుకున్నారు.

# సీ.ఎం.ఆర్ లక్ష్యాలను గడువు లోగా పూర్తి చేయాలి

**-మంచిర్యా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల, మహా : సీ.ఎం.ఆర్ లక్ష్యాలను గడువు లోగా పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం హాజీపూర్ మండలంలోని ఎస్ ఆర్ ఎం రైస్ మిల్లును జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు తో, గాయత్రి రైస్ మిల్ ను మండల తహసిల్దార్ పుష్పలత తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధర చెల్లించి, రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు.ఇలా కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులు, గోదాములకు తరలిస్తున్నామని పేర్కొన్నారు. రైస్ మిల్లుల కేటాయించిన ధాన్యం సీఎంఆర్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా అధికారుల కృషి చేయాలని ఆదేశించారు.



# నర్కుడ గ్రామంలో ఘనంగా ఇందిరమ్మ గృహప్రవేశాల సందడి...

- దశాబ్దాల పేదింటి కలలను ప్రభుత్వం నెరవేర్చింది....
- లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన..
- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్ మహా ;** తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ( టీజీహెచ్సీఎల్ ) ఆధ్వర్యంలో శంషాబాద్ మండలం నర్కూడ గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్, ఉప సర్పంచ్ నిరటి మహేష్, ఎంపీడీవో మున్ని, లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ గృహప్రవేశాల ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ

రాష్ట్రవ్యాప్తంగా లక్ష గృహప్రవేశాలు కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అందులో భాగంగా రంగారెడ్డి జిల్లాలో 3,144 ఇళ్లను లబ్ధిదారులకు అందజేయడం సంతోషకరమన్నారు.అందరికీ ఇల్లు సురక్షిత నివాసం' అనే లక్ష్యంతో ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు, సొంత గౌరవాన్ని అందించడమే ఈ ప్రభుత్వ ధ్యేయం. ప్రభుత్వం తోడుగా ఉంటుంది. ప్రతి కుటుంబానికి శుభాభినందనలు తెలియజేస్తోందిఅని అన్నారు. సొంత ఇంటి కల నెరవేరినందుకు లబ్ధిదారులు ఎమ్మెల్యే కి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, గ్రామ పెద్దలు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పట్నంలో అక్రమ లేఔట్లతో చెరువుల ధ్వంసం.!

- **గొలుసు కట్టు చెరువులకు వెళ్లే నాలాలు ధ్వంసం**
- **పట్నానికి తాగు సాగునీటికి ప్రధాన చెరువులు**
- **నేడు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కాల్వలు కనుమరుగు**
- **అక్రమ లేఔట్ల పై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.?**
- **సిపిఐ మండల పార్టీ అధ్యక్షులు కావలి సురేష్**




ఇబ్రహీంపట్నం జూన్ 1 మహా:ఇబ్రహీంపట్నానికి తాగు సాగునీటి వనరులకు ప్రధానంగా ఉన్న గొలుసు కట్టు చెరువులను, రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమ లేఔట్లతో విధ్వంసానికి పాల్పడుతున్నారని కావలి సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నంలో అక్రమ లేఅవుట్లతో బోంతపల్లికుంట మొగుళ్ల కుంట అలీమీయకుంట నుండి గోశాల వరకు ఉన్న సాగునీటి పరివాహక ప్రాంతాన్ని, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ధ్వంసం చేస్తున్నారని, సిపిఐ నాయకులు కావలి సురేష్, ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం జరిగింది. సిపిఐ మండల కమిటీ అధ్యక్షులు కావలి సురేష్ మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నంలో సాగునీటి తాగునీటికి ప్రధాన వనరులుగా ఉన్న, బోంతపల్లి కుంట మొగుళ్ళకుంట అలిమీయ కుంట మీదుగా గొలుసుకట్టుగా గోశాల వరకు నీటి పరివాహక ప్రాంతంగా ఉన్నది. ఇబ్రహీంపట్నంలో సాగు, తాగు నీటికి ప్రధాన వనరు, నేడు నవభూమి రియల్ వ్యాపార సంస్థ బొంతపల్లి కుంటను, నీటి పరివాహక ప్రాంతంగా ఉన్నదాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వీటి పరిధిల మట్టి నింపడం, ప్లాంట్లు చేయడం, అస్త్రము నిర్మాణాలు చీయడం వంటి చర్యాలతో నీటి ప్రవాహానికి ఆటకం ఏర్పడు తుంది. భవిష్యత్ ఖం వరదలు, ముప్పు వంటి సమస్యలు తల్లెత్తి ప్రమాదం ఉంది. ప్రభుత్వ భూములు, కుంటలు, చెరువులు, కాల్వల పరిరక్షణకు విగాతం కలిగిస్తుందని, అందువల్లన సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి విచారణ జరిపించి, వరలు తీసుకోవాలని మ అక్రమంగా నిర్మిస్తున్న లేవుట్లపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని మండల సిపిఐ పార్టీ అధ్యక్షులు కావలి సురేష్ కోరారు.

**గొలుసుకట్టు చెరువులను కాపాడాలి...**

గొలుసుకట్టు చెరువులుగా ఉన్న బొంతపల్లి కుంట, మొగుళ్ళకుంట, ఆలీమియా కుంటకు రావలసిన నీటి ప్రవాహాన్ని, బొంతపల్లి కుంట వద్ద ఉన్న కాలువను ధ్వంసం చేస్తూ, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కాల్వను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, బొంతపల్లి కుంట కాల్వ నుంచి వచ్చే నీటికి అడ్డుకట్ట వేస్తే నీటి ప్రవాహం ఎటు వెళ్లాలనే ప్రశ్నగా మిగిలిపోతుందని, కావలి సురేష్, పలువురు ఆరోపిస్తున్నారు.

# ఘన తెలంగాణ పుష్కరకాలం.. ప్రగతి వేగం

**హైదరాబాద్, మహా :** జూన్ 2, 2026 నాటికి తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి విజయవంతంగా 12 వసంతాలు పూర్తి చేసుకుని నవ చరిత్రను లిఖిస్తోంది. ఆరు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం, నెత్తుటి త్యాగాల పునాదుల మీద ఉదయించిన 29వ రాష్ట్రం, నేడు అన్ని రంగాల్లో అప్రతిహత విజయాలతో యావత్ దేశానికే ఒక సజీవ దిక్సూచిగా నిలుస్తోంది. ఒకప్పుడు కరువు కాటకాలతో, నెర్రెలు బారిన నేలలతో, కరెంటు కష్టాలతో అల్లాడిన ఈ ప్రాంతం, ఈ పన్నెండేళ్లలో స్పష్టమైన దార్శనికతతో, అత్యంత పకడ్బందీ ప్రణాళికాబద్ధమైన పాలనతో అద్భుతమైన ప్రగతిని నమోదు చేసింది. ఈ చారిత్రక 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని జూన్ 2, 2026న పరేడ్ గ్రౌండ్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం రాష్ట్ర పండుగలా అత్యంత వైభవంగా నిర్వహిస్తోంది. పాలకులు ఎవరైనా.. తెలంగాణ ప్రగతిదూకుడు కొనసాగుతోంది. పలు రంగాల్లో కేసీఆర్ ప్రగతికి బాటలు వేయగా, ఇండ్లతో పాటు నవనగర నిర్మాణంతో రేవంత్ తనదైన ముద్ర వేస్తున్నారు. సబ్బండ వర్గాల సంక్షేమమే పరమావధిగా తెలంగాణ సాధించిన ఈ సమగ్ర సామాజిక, ఆర్థిక పురోగతి ఇతర రాష్ట్రాలకు ఒక అద్భుతమైన నమూనాగా మారి భారత దేశానికే "మహా" స్ఫూర్తినిస్తోంది.

**ఆర్థికాభివృద్ధిలో తెలంగాణ దూకుడు**

ఆర్థికాభివృద్ధిలో తెలంగాణ సాధించిన రికార్డులు చూస్తే సామాన్యులకే కాకుండా ఆర్థిక నిపుణులకు సైతం మతిపోవడం ఖాయం. 202526 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) ప్రస్తుత ధరల వద్ద ఏకంగా రూ. 18,00,325 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేయబడింది, ఇది అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఏకంగా 12 శాతం అద్భుత వృద్ధి. జాతీయ సగటు వృద్ధి రేటును అలవోకగా దాటేస్తూ స్థిరంగా ఎదుగుతున్న మన రాష్ట్రం, దేశ జీడీపీలో ఐదు శాతం వాటాను అందిస్తూ అత్యంత బలమైన ఆర్థిక శక్తిగా అవతరించింది. ఇక రాష్ట్ర పౌరుల సగటు కొనుగోలు శక్తికి అద్దం పట్టే తలసరి ఆదాయం అయితే రికార్డు స్థాయిలో రూ. 4.18 లక్షల మార్కును దాటేసి, జాతీయ సగటు కంటే ఏకంగా 1.9 రెట్లు ఎక్కువగా నమోదు కావడం తెలంగాణ సృష్టించిన ఆర్థిక సునామీకి నిలువెత్తు సాక్ష్యం.

**బీడు భూముల్లో జల జాతర**

దశాబ్దాల పాటు వాన దేవుడి కరుణ కోసం ఆకాశం వంక చూసి ఆక్రోశించిన బీడు నేల, నేడు ఉప్పొంగే జలకళతో అక్షరాలా పచ్చల హారంగా మారిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా, యుద్ధప్రాతిపదికన నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం, మరియు మిషన్ కాకతీయ ద్వారా ప్రాణం పోసుకున్న వేలాది చెరువులతో తెలంగాణ ముఖచిత్రం సమూలంగా మారిపోయింది. 2014 రాష్ట్ర ఆవిర్భావ సమయానికి కేవలం 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం, 202324 నాటికి ఏకంగా 2.2 కోట్ల ఎకరాలకు చేరుకొని అక్షరాలా 70 శాతం అనూహ్య వృద్ధిని నమోదు చేసి సంచలనం సృష్టించింది. నికర నీటిపారుదల విస్తీర్ణం సైతం ఏకంగా 95 శాతం పెరిగి దాదాపు రెట్టింపు కావడం తెలంగాణ సాధించిన జల విప్లవానికి సజీవ తార్కాణంగా నిలుస్తోంది. దీనికి తోడు స్థూల నీటిపారుదల విస్తీర్ణం 25.28 లక్షల హెక్టార్ల నుండి 56.37 లక్షల హెక్టార్లకు పెరిగి ఏకంగా 123 శాతం అసాధారణ పెరుగుదలను నమోదు చేయడం రాష్ట్ర రైతాంగానికి దక్కిన మహా వరం.



## రికార్డులు బద్దలుకొడుతున్న ధాన్యరాశులు

**జల సిరుల రాకతో తెలంగాణ రాష్ట్రం నేడు దేశానికే అన్నం పెట్టే ప్రధాన ధాన్యాగారంగా, అన్నపూర్ణగా అవతరించింది. కేంద్ర ఆర్థిక సర్వే తాజా అంచనాల ప్రకారం ఏకంగా 17.45 మిలియన్ టన్నుల వరి ఉత్పత్తితో మన రాష్ట్రం భారతదేశంలోనే రెండవ స్థానంలో నిలవగా, పత్తి ఉత్పత్తిలో 5.79 మిలియన్ టన్నుల దిగుబడితో దేశంలో మూడవ స్థానంలో నిలిచి మన రైతన్నలు తమ సత్తాను ప్రపంచానికి చాటారు. దీనికి తోడు అన్నదాతలకు పెట్టుబడి కష్టాలు తీర్చేందుకు తీసుకువచ్చిన రైతుబంధు లాంటి ప్రత్యక్ష నగదు బదిలీ పథకాల ద్వారా ఏటా వేలాది కోట్ల రూపాయలు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఈ విప్లవాత్మక పథకం ద్వారా ఇప్పటివరకు ఏకంగా రూ. 80,453 కోట్ల భారీ నిధులను రైతులకు పంపిణీ చేసి దేశంలోనే మరే ఇతర రాష్ట్రం చేయని సాహసం చేసింది. భవిష్యత్తులో పంట దిగుబడి తగ్గినా కూడా రైతులకు పూర్తి పరిహారం అందేలా రైతు బీమా పథకంలో ఏకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను వినియోగించే యోచనలో ప్రభుత్వం ఉండటం వ్యవసాయ రంగంపై ఉన్న అచంచలమైన చిత్తశుద్ధిని తెలియజేస్తోంది.**

**లక్షల కోట్లతో విశ్వనగరంగా ఐటీ ఖిల్లా**

ఒకవైపు వ్యవసాయ రంగంలో దూసుకుపోతూనే, పారిశ్రామిక మరియు సమాచార సాంకేతిక (ఐటీ) రంగాల్లో కూడా తెలంగాణ అంతర్జాతీయ పెట్టుబడులకు అసలైన స్వర్గధామంగా మారింది. 202425 నాటికి రాష్ట్ర ఐటీ ఎగుమతులు అక్షరాలా రూ. 3.13 లక్షల కోట్లకు చేరుకొని మునుపెన్నడూ లేని సరికొత్త రికార్డు సృష్టించగా, ప్రత్యక్షంగా 9.46 లక్షల మందికి పైగా యువతకు ఐటీ రంగం ఉపాధిని కల్పిస్తోంది. ఈ 12 ఏండ్ల కాలంలో ఐటీ రంగ ఉపాధి కల్పనలో ఏకంగా 193 శాతం వృద్ధి నమోదు కావడం ఈ గడ్డ సృష్టించిన పెను సంచలనం. పారిశ్రామిక అనుమతులను అత్యంత సులభతరం చేస్తూ తీసుకువచ్చిన విప్లవాత్మక టీఎస్ఐపాస్ సింగిల్ విండో విధానం ద్వారా అక్షరాలా రూ. 2,85,451 కోట్ల భారీ పెట్టుబడులు రాష్ట్రానికి క్యూ కట్టాయి. నేడు మన హైదరాబాద్ మహానగరం గ్లోబల్ విశ్వనగరంగా ఎదగడమే కాకుండా, ద్వితీయ శ్రేణి నగరాలకు కూడా ఐటీ, పరిశ్రమలు శరవేగంగా విస్తరించడం మహాద్భుతం.

3 ట్రిలియన్ డాలర్ల టార్గెట్ తో భవిష్యత్ దార్శనికత రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో కరెంటు కోతలతో, పవర్ హాలిడేలతో చీకట్లో మగ్గి పరిశ్రమలు మూతపడిన భయానక పరిస్థితుల నుంచి, అనతికాలంలోనే 24 గంటల నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసే స్థాయికి చేరుకొని తెలంగాణ నయా చరిత్ర సృష్టించింది. భవిష్యత్తులో 2047 నాటికి తెలంగాణను ఏకంగా 3 ట్రిలియన్ డాలర్ల భారీ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న మహత్తర లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించిన దార్శనికత ప్రకారం, ఈ లక్ష్యాన్ని చేరాలంటే రాష్ట్రం ఏటా 13 శాతం ఆర్థిక వృద్ధిని నిరంతరాయంగా సాధించాల్సి ఉంది. అప్పటికి అవసరమయ్యే సుమారు 1,39,310 మెగావాట్ల భారీ డిమాండ్‌ను తీర్చేందుకు సౌర మరియు పునరుత్పాదక ఇంధన రంగాలపై వేలాది కోట్లు వెచ్చిస్తూ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి పెద్దపీట వేస్తోంది. 2026 ఏప్రిల్ నాటికే రాష్ట్ర కాంట్రాక్టెడ్ విద్యుత్ సామర్థ్యం ఏకంగా 24,769 మెగావాట్లకు చేరుకోవడం ప్రగతికి నిదర్శనం.



## బడుగుల ఇళ్లలో నిండు వెలుగులు

ఆర్థిక అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తికి, అట్టడుగు వర్గాలకు చేరినప్పుడే దానికి నిజమైన సార్థకత అన్న సామాజిక న్యాయ సూత్రంతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు జాతీయ స్థాయిలో ప్రశంసల జల్లు కురిపిస్తున్నాయి. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత మరియు బీడీ కార్మికులు కలుపుకుని సుమారు 37 లక్షలకు పైగా లబ్ధిదారులకు నెలకు రూ. 2,016, అలాగే దివ్యాంగులకు రూ. 4,016 చొప్పున ఆసరా పింఛన్లు అందిస్తూ ప్రభుత్వం లక్షలాది మంది పేదలకు కొండంత ఆత్మగౌరవాన్ని కల్పిస్తోంది. నిరుపేద ఆడబిడ్డల పెళ్లిళ్ల భారాన్ని తల్లిదండ్రుల నుంచి తప్పించేందుకు తీసుకువచ్చిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్




పథకాల కింద అందిస్తున్న రూ. 1,00,116 ఆర్థిక సాయం పేద ఇళ్లలో కన్నీళ్లు తుడిచి సరికొత్త సామాజిక విప్లవానికి నాంది పలికింది. ఈ సంక్షేమ రథచక్రాన్ని మరింత వేగంగా ముందుకు నడిపించేందుకు ప్రస్తుత ప్రభుత్వం 'ఆరు గ్యారంటీల' కింద మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలతో దార్శనికతను చాటుకుంటోంది.

## ఇంటింటికీ జలాలు.. వైద్య రంగంలో సంచలనాలు

రాష్ట్రంలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన, శుద్ధి చేసిన నదీ జలాలను అందించాలనే ఉక్కు సంకల్పంతో చేపట్టిన అద్భుత ప్రాజెక్టు మిషన్ భగీరథ ద్వారా ఏకంగా 53.44 లక్షల గ్రామీణ గృహాలకు ఫంక్షనల్ నల్లా కనెక్షన్లు ఇచ్చి (రికార్డు స్థాయిలో 98.31 శాతం కవరేజ్) తెలంగాణ యావత్ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా రికార్డు సృష్టించింది. మరోవైపు భవిష్యత్ తరాల కోసం విద్యా, వైద్య రంగాలలో సంచలనాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. 'జిల్లాకో ప్రభుత్వ వైద్య కళాశాల' అన్న బృహత్తర లక్ష్యంతో రాష్ట్రంలో మెడికల్ కాలేజీల సంఖ్య అనూహ్యంగా 66 కి



చేరుకోగా, ఏకంగా 9,540 ఎంబీబీఎస్ సీట్లతో మారుమూల ప్రాంతాల పేద విద్యార్థులకు సైతం కార్పొరేట్ స్థాయి వైద్య విద్య అందుబాటులోకి రావడం ఈ పన్నెండేళ్ల అద్భుత ప్రగతి ప్రస్థానంలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘనత. నేడు ఎంబీబీఎస్ సీట్లలో 85 శాతం కేవలం తెలంగాణ విద్యార్థులకే దక్కడం యువత పాలిట ఒక మహా వరం.

**ఫ్యూచర్ ప్రణాళికలు**

హైదరాబాద్ నగరంలో నాలుగోసిటీగా భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నారు. దాదాపు 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీకి సీఎం రేవంత్ రెడ్డి రూపకల్పన చేయగా, పరిశ్రమలు తరలివస్తున్నాయి. హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ కు ఆనుకుని ఏర్పాటవుతున్న నవనగరానికి బుల్లెట్ ట్రైన్ జంక్షన్, డ్రైపోర్ట్ అదనపు ఆకర్షణలు కానున్నాయి. ఇక మూసీ ప్రక్షాళన హైదరాబాద్ డెవలప్ మెంట్ ను మరో అడుగు ముందుకు తీసుకెళ్లనుంది.

---

# ఉద్యమం నుంచి అభివృద్ధి దిశగా

**తెలంగాణ ఆవిర్భవించి పన్నెండేళ్లు పూర్తవుతున్న వేళ, రాష్ట్రం తన చరిత్రలో మరో కీలక మలుపు వద్ద నిలిచింది. దశాబ్దాల ఉద్యమం, అనేక త్యాగాలు, కోట్లాది ప్రజల ఆకాంక్షల ఫలితంగా సాధించిన ప్రత్యేక రాష్ట్రం నేడు కేవలం ఒక భౌగోళిక వాస్తవం మాత్రమే కాదు ప్రజల ఆశయాలను నెరవేర్చాల్సిన సామాజిక ఆర్థిక బాధ్యత కూడా. ఉద్యమం సాధించిన విజయాన్ని స్మరించుకోవడం ఎంత ముఖ్యమో, ఆ ఉద్యమం నిర్దేశించిన లక్ష్యాల వైపు రాష్ట్రం ఎంత దూరం ప్రయాణించిందో సమీక్షించుకోవడం అంతకన్నా ముఖ్యం. స్వరాష్ట్ర స్వప్నం నుంచి ప్రజా తెలంగాణ లక్ష్యం వరకు సాగిన ఈ పన్నెండేళ్ల ప్రయాణం విజయాలు, వైఫల్యాలు, అవకాశాలు, సవాళ్ల సమ్మేళనంగా నిలిచింది.**



2014లో రాష్ట్రం ఏర్పడినప్పుడు తెలంగాణ ముందు అనేక సవాళ్లు నిలిచాయి. పరిపాలనా వ్యవస్థను పునర్నిర్మించడం, అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడం, వెనుకబడిన ప్రాంతాలకు మౌలిక వసతులు కల్పించడం వంటి అంశాలు ప్రాధాన్యత పొందాయి. తొలి దశలో రాష్ట్ర నిర్మాణం ప్రధాన అజెండాగా ఉన్నప్పటికీ, నేడు సంక్షేమం, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ఆర్థిక అభివృద్ధి వంటి అంశాలు ప్రజా చర్చల్లో కేంద్రంగా నిలుస్తున్నాయి. ఇదే తెలంగాణ ప్రయాణం కొత్త దశలోకి ప్రవేశించిందనడానికి సంకేతం.

తెలంగాణ ఉద్యమ చరిత్రను పరిశీలిస్తే, రాజకీయ పార్టీల పాత్రపై భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు. అయితే రాష్ట్ర ఏర్పాటు నిర్ణయాన్ని అమలు చేసిన రాజకీయ నాయకత్వానికి చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంటుంది. ఉద్యమం ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తే, రాజకీయ నిర్ణయం వాటికి రాజ్యాంగబద్ధ రూపాన్ని ఇచ్చింది. అందుకే తెలంగాణ ఆవిర్భావం ఒక రాజకీయ సంఘటన మాత్రమే కాదు ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రజల ఆశయాలకు ఇచ్చిన స్పందన.

అయితే రాష్ట్రం ఏర్పడిన తర్వాత అసలు ప్రశ్న ఒకటే? ఉద్యమ సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఎంత వరకు నెరవేరాయి? ప్రత్యేక రాష్ట్రం వస్తే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని, రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ప్రాంతీయ అసమానతలు తొలగిపోతాయని, వెనుకబడిన వర్గాలకు న్యాయం జరుగుతుందని ప్రజలు ఆశించారు. ఈ ఆశయాల సాధనలో ప్రభుత్వాల పనితీరు నిరంతరం ప్రజా పరిశీలనకు లోనవుతూనే ఉంటుంది.

2023 ఎన్నికల అనంతరం ఏర్పడిన కొత్త ప్రభుత్వం "ప్రజా పాలన"ను ప్రధాన నినాదంగా ముందుకు తీసుకువచ్చింది. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేయాలనే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ వినియోగ విద్యుత్ రాయితీలు, తక్కువ ధరకు గ్యాస్ సిలిండర్లు, ఆరోగ్య భద్రత విస్తరణ వంటి కార్యక్రమాలు నేరుగా ప్రజల జీవన వ్యయాన్ని తగ్గించే దిశగా సాగుతున్నాయి. సంక్షేమ పథకాలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా సామాజిక భద్రతా వ్యవస్థగా మారితేనే వాటి అసలు ప్రయోజనం తెలుస్తుంది.

మహిళల సాధికారత విషయంలో తెలంగాణ తీసుకుంటున్న చర్యలు ప్రత్యేకంగా ప్రస్తావించదగ్గవి. మహిళ ఆర్థికంగా బలపడితే కుటుంబం బలపడుతుంది; కుటుంబం బలపడితే సమాజం ముందుకు సాగుతుంది. ఈ సూత్రాన్ని దృష్టిలో పెట్టుకుని అమలు చేస్తున్న పథకాలు మహిళల ఆర్థిక భాగస్వామ్యాన్ని పెంచే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణ ప్రాంతాల్లోనూ మహిళల నుంచి వస్తున్న స్పందనలు ఆ దిశలో ఆశాజనక సంకేతాలను ఇస్తున్నాయి.

గృహనిర్మాణం మరో కీలక అంశం. సొంత ఇల్లు ఇప్పటికీ అనేక పేద, మధ్యతరగతి కుటుంబాలకు కలగానే ఉంది. ఈ నేపథ్యంలో గృహ నిర్మాణ పథకాలు కేవలం సంక్షేమ కార్యక్రమాలు మాత్రమే కావు; అవి సామాజిక భద్రతకు సంబంధించిన అంశాలు. గృహంతో పాటు తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు సమగ్రంగా అందినప్పుడే జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.

తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం కీలక రంగం. రైతాంగం రాష్ట్ర నిర్మాణంలోనూ, ఉద్యమంలోనూ ప్రధాన శక్తిగా నిలిచింది. అందుకే రైతు సంక్షేమం ప్రభుత్వ విధానాల్లో కేంద్ర స్థానంలో ఉండాల్సిందే. రుణమాఫీ, పెట్టుబడి సాయం, పంటలకు ప్రోత్సాహకాలు వంటి చర్యలు రైతులకు తాత్కాలిక ఉపశమనం కల్పించవచ్చు. కానీ వ్యవసాయం స్థిరమైన లాభదాయక రంగంగా మారాలంటే మార్కెటింగ్ వ్యవస్థ, నిల్వ సదుపాయాలు, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు, నీటి నిర్వహణ వంటి అంశాల్లో దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం.

యువత ఉపాధి ప్రశ్న తెలంగాణ భవిష్యత్తుకు అత్యంత కీలకమైన అంశం. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ నిరుద్యోగుల్లో ఆశలు పెంచినప్పటికీ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలంటే ప్రైవేట్ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు సృష్టించాల్సిందే. పెట్టుబడులను ఆకర్షించడం, పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పించడం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తరించడం ద్వారా యువతకు కొత్త అవకాశాలు లభిస్తాయి. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపడుతున్న కార్యక్రమాలు ఈ దిశలో కీలకంగా మారవచ్చు.


అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో కూడా తెలంగాణ ప్రస్తుతం కీలక దశలో ఉంది. ఫ్యూచర్ సిటీ, మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవన కార్యక్రమాలు వంటి ప్రాజెక్టులు భవిష్యత్తు నగర రూపురేఖలను నిర్ణయించగలవు. అయితే అభివృద్ధి పేరిట పర్యావరణ సమతుల్యత దెబ్బతినకూడదు. ప్రజల పునరావాసం, ఆర్థిక సాధ్యత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను సమన్వయం చేయడం ప్రభుత్వాలకు అత్యంత ముఖ్యమైన బాధ్యత.

ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో ఎక్కువగా చర్చకు వస్తున్న అంశం సామాజిక న్యాయం. వెనుకబడిన వర్గాలకు అధిక అవకాశాలు కల్పించడం, రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచడం, రిజర్వేషన్ విధానాలను బలోపేతం చేయడం వంటి చర్యలు జాతీయ స్థాయిలో కూడా చర్చనీయాంశంగా మారుతున్నాయి. సామాజిక న్యాయం అనేది కేవలం ఎన్నికల నినాదంగా కాకుండా పాలనా తత్వంగా మారినప్పుడే దాని అసలు ప్రయోజనం సమాజానికి అందుతుంది.

అయితే తెలంగాణ ముందున్న సవాళ్లు కూడా చిన్నవి కావు. పెరుగుతున్న అప్పులు, ఆదాయ వనరుల విస్తరణ అవసరం, పట్టణీకరణ వల్ల ఏర్పడుతున్న ఒత్తిళ్లు, నీటి వనరుల సమర్థ నిర్వహణ, విద్యా-ఆరోగ్య రంగాల బలోపేతం వంటి అంశాలు ప్రభుత్వ ముందున్న ప్రధాన పరీక్షలు. సంక్షేమం మరియు ఆర్థిక క్రమశిక్షణ మధ్య సమతుల్యత సాధించడం ప్రతి ప్రభుత్వానికి క్లిష్టమైన సవాలే.

పన్నెండేళ్ల తెలంగాణ ప్రయాణం మనకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. ప్రత్యేక రాష్ట్రం సాధించడం అంతిమ లక్ష్యం కాదు; అది ఒక ప్రారంభం మాత్రమే. ఉద్యమం కోరుకున్న సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం, అవకాశాల విస్తరణ, ప్రజల గౌరవప్రద జీవనం వంటి లక్ష్యాలు పూర్తిస్థాయిలో నెరవేరినప్పుడే తెలంగాణ ఉద్యమం తన పరిపూర్ణతను పొందుతుంది.

ఆవిర్భావ దినోత్సవ వేళ తెలంగాణ ప్రజలు గతాన్ని గర్వంగా స్మరించుకోవాలి. అదే సమయంలో భవిష్యత్తుపై బాధ్యతతో ఆలోచించాలి. రాజకీయాలు మారవచ్చు, ప్రభుత్వాలు మారవచ్చు. కానీ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి మాత్రం శాశ్వతం. ఆ స్ఫూర్తిని ప్రజా సంక్షేమం, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి రూపంలో కొనసాగించగలిగితేనే ఉద్యమానికి నిజమైన నివాళి అర్పించినవారమవుతాం. ఉద్యమ స్వప్నం నుంచి ప్రజా తెలంగాణ దిశగా సాగుతున్న ఈ ప్రయాణం మరింత సార్థకంగా మారాలని ఆకాంక్షిద్దాం.



**అమరవాజీ నాగరాజు**
టీపీసీసీ ప్రెసిడెంట్ పీఆర్ఓ



# ఇందిరమ్మ గృహప్రవేశాల్లో భువనగిరి ఎమ్మెల్యే కుంభం

**యాదాద్రి భువనగిరి, మహా** : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. సోమవారం నాడు అత్యంత వైభవంగా జరిగిన ఈ శుభకార్యక్రమాలలో ఆయన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. నూతన గృహాల్లోకి అడుగుపెడుతున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే, ఎంపీ, ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సాంప్రదాయబద్ధంగా లబ్ధిదారులకు పట్టు వస్త్రాలను సమర్పించారు. పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయడం, వారి ముఖాల్లో ఆనందాన్ని చూడటం అత్యంత తృప్తినిచ్చే విషయమని, నూతన ఇందిరమ్మ గృహాల్లోకి అడుగుపెడుతున్న కుటుంబాలన్నింటికీ శుభం జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవైస్ , మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి,వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్,స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు,వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# ఆలేరు నియోజకవర్గంలో గృహప్రవేశాల కళ

- **ఇందిరమ్మ ఇళ్ళ సంబురాల్లో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య**

**యాదాద్రి భువనగిరి, జూన్ 1 మహా** : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా సామూహిక గృహప్రవేశాల కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. పేద ప్రజలకు సొంత ఇంటి కలను సాకారం చేస్తూ ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. ఆలేరు నియోజకవర్గం యాదగిరిగుట్ట పట్టణంలోని 6 వ వార్డులో నిర్మించిన ఇద్దరి ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ,అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు ప్రారంభించారు. యాదగిరిగుట్ట మండలం ఆరో వార్డుకు చెందిన లబ్ధిదారులు రాహుల్ మాలతి, సుధగాని సంధ్య నాగేష్ కుటుంబాల ఇందిరమ్మ ఇళ్లలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు నిర్వహించి గృహప్రవేశం చేయించారు. అనంతరం లబ్ధిదారులకు పట్టు బట్టలు అందజేసి, పాలు పొంగించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, పేద ప్రజలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి అర్హత కుటుంబానికి సొంత ఇల్లు అందేలా ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. పేద ప్రజలకు సొంతింటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో "ఇందిరమ్మ ఇళ్ల" పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, వార్డు ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయండి

- సింగరేణి జీఎం పర్సనల్ కవితా నాయుడు
- వేడుకలకు హాజరుకానున్న సింగరేణి చైర్మన్ బుద్ధ ప్రకాష్ జ్యోతి

భద్రాద్రి బ్యూరో, మహా:సింగరేణి కార్పొరేట్ ఆధ్వర్యంలో ఈనెల రెండవ తేదీన సింగరేణి ప్రకాశం స్టేడియం గ్రౌండ్ నందు జరిగే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని సింగరేణి జీఎం పర్సనల్ కవితా నాయుడు తెలిపారు. సోమవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సింగరేణియులు వారి కుటుంబ సభ్యులు కార్మిక సంఘాల ప్రతినిధులు కొత్తగూడెం పట్టణ ప్రజలు పరిసర ప్రాంత వాసులు అధిక సంఖ్యలో పాల్గొని సంబరాలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. వేడుకలకు ముఖ్య అతిథిగా సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి పాల్గొంటారని తెలిపారు. మొదటగా సింగరేణి హెడ్ ఆఫీస్ లో జాతీయ జెండా ఆవిష్కరణ ఉంటుందన్నారు. తర్వాత తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ప్రకాశం స్టేడియం నుండి కొత్తగూడెం బస్టాండ్ వద్ద గల తెలంగాణ అమరవీరుల స్థూపం వరకు తెలంగాణ రన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. సాయంత్రం ప్రకాశం స్టేడియం నుండి కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ వద్ద గల తెలంగాణ అమరవీరుల స్థూపం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అమరులైన తెలంగాణ వీరులకు నివాళులు అర్పించే కార్యక్రమం ఉంటుందని వివరించారు. అదేరోజు సాయంత్రం స్టేడియంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ సాంస్కృతిక ఉత్సవాలకు ప్రముఖ సినీ టీవీ కళాకారుల బృందం పాల్గొని ప్రదర్శనలు చేయనున్నారని చెప్పారు. ప్రముఖ సింగర్లు సాయి శ్రీ చరణ్, నసిరుద్దీన్, సత్యభామ స్వాతి, రజని, వెన్నెల, సద్దాంలు వస్తున్నారని చెప్పారు. ప్రముఖ శాస్త్రీయ నృత్య కళాకారుని డాక్టర్ సీతా ప్రసాద్ బృందం వారిచే నిత్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవ దినోత్సవ వేడుకలకు సంబంధించిన వాల్ పోస్టర్ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జీఎం పర్సనల్ వెల్ఫేర్ అండ్ సి ఎస్ ఆర్ అజయ్ కుమార్, డీజీఎం పర్సనల్ వెల్ఫేర్ కేసా నారాయణరావు, శివ కేశవరావు, అధికారులు శ్రీనివాస్, వరప్రసాదరావు, స్పోర్ట్స్ సూపర్వైజర్ ఎంసీ పోస్ నెట్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- సామూహిక ఇందిరమ్మ గృహప్రవేశాలలో పాల్గొన్న వైరా ఎమ్మెల్యే
- లబ్ధిదారులతో ఆనందాన్ని పంచుకున్న రాందాస్ నాయక్



**జూలూరుపాడు, మహా:** తెలంగాణ రాష్ట్రంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ, ప్రజారంజక పాలన చేస్తున్న, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని మరల ప్రజలందరూ ఆశీర్వదించాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కోరారు. సోమవారం మండలంలోని పడమట నర్సాపురం, జూలూరుపాడు, వెంగన్నపాలెం గ్రామాలలో జరిగిన సామూహిక ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సాపురం గ్రామంలోని కొరివి సరిత కోటేశ్వరరావు దంపతుల ఇందిరమ్మ గృహప్రవేశానికి విచ్చేసిన ఎమ్మెల్యే కి మంగళ హారతులతో స్వాగతం పలికారు. నూతన ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ గ్రామ సర్పంచ్ లక్ష్మీ కుమారి తో కలసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సొంతింటి కల నెరవేరిన లబ్ధిదారులతో కలిసి ముచ్చటించారు. వారితో ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు, గృహ వినియోగదారులకు ఫ్రీ కరెంటు, సన్న బియ్యం, రైతు భరోసా, రుణమాఫీ, దేశంలో ఎక్కడా లేనివిధంగా ఐదు లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇల్లు, రైతులకు నిరంతర విద్యుత్ తోపాటు పట్టణ పల్లె ప్రాంతాలలో అనేకరకాల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులందరికీ ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజన సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. కాబట్టి ప్రజలందరూ ప్రజా ప్రభుత్వాన్ని, ప్రజా ప్రతినిధులను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి కుమారి, ఉప సర్పంచ్ ఆళ్ల ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లేళ్ళ వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మంగీలాల్ నాయక్, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రవి, ఎంపీఓ తులసీ రామ్, హౌసింగ్ ఏఈ, దుద్దుకూరి మధుసూదనరావు, సుమంత్, ప్రియాంక, అల్లడి నరసింహారావు, ఆర్కే నాయుడు, లేళ్ళ అప్పిరెడ్డి, రామకోటి, చిన్న రాజు, గోపాలరెడ్డి, నాగరాజు, హరీష్ తోపాటు వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెంచాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**




**భద్రాద్రి బ్యూరో, మహా:** పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెంచాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా స్థాయి పర్యావరణ పరిరక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ఒక శాఖ బాధ్యత మాత్రమే కాదని సమాజంలోని ప్రతి వ్యక్తి బాధ్యతగా భావించి ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణ మార్పులు పెరుగుతున్న కాలుష్యం సహజ వనరుల క్షీణత వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా చేపట్టనున్న కార్యక్రమాలను గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు విస్తృతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జూన్ 1 నుండి 12 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమాలు ప్రజల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించేలా ఉండాలని ప్రతి గ్రామం విద్యాసంస్థలు ప్రతి ప్రభుత్వ కార్యాలయం ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని నాటిన ప్రతి మొక్కను పెంచి పెద్ద చెట్టుగా తీర్చిదిద్దినప్పుడే కార్యక్రమం విజయవంతమవుతుందని అన్నారు.
అనంతరం జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యాచరణలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని శాఖల అధికారులు తమ తమ పరిధిలో సమన్వయంతో పని చేయాలని కోరారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాకు 55 లక్షల మొక్కల నాటే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని ఆ లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 50 శాతానికి పైగా అటవీ విస్తీర్ణం ఉందని అన్ని శాఖల సమన్వయంతో గత రెండు సంవత్సరాలుగా ఒక్క ఎకరం పోడు భూమి కూడా నరికివేయకుండా సంరక్షించగలిగామని తెలిపారు. జిల్లాలో పామాయిల్ జామాయిల్ వెదురు తదితర పంటల సాగు విస్తరించడంతో జిల్లా పచ్చదనంతో కళకళలాడుతోందని రాష్ట్రంలో పచ్చదన పరిరక్షణలో జిల్లా రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ గోడపత్రికను జిల్లా కలెక్టర్ అంకిత్ ఆవిష్కరించారు. అనంతరం అటవీ శాఖ సిబ్బంది విధుల నిర్వహణలో భద్రతకు ఉపయోగపడే సేఫ్టీ కిట్లను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డీఆర్ఓ పద్మావతి, అటవీ శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేశ్య తండా నీటి కొరతకు శాశ్వత పరిష్కారం

**నూతన మోటార్ ను ప్రారంభించిన వైరా ఎమ్మెల్యే**



**జూలూరుపాడు, మహా:** మండల పరిధి నర్సాపురం గ్రామపంచాయతీలోని దేశ్య తండా నీటి కొరత కు వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ చొరవతో శాశ్వత పరిష్కారం లభించింది. తండావాసుల తీవ్ర నీటి కొరతను తీర్చాలని గ్రామ సర్పంచ్ సంఘం లక్ష్మీ కుమారి అభ్యర్థనకు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే 7 లక్షల రూపాయల డిఎంఎఫ్టి నిధులను మంజూరి చేశారు. ఆ నిధులతో తండాలో నూతన బోరు, మోటారు, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను ఏర్పాటు చేయడం జరిగింది. సోమవారం నూతన మోటారును వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ గ్రామ సర్పంచ్ లక్ష్మి కుమారితో కలిసి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. దీంతో ఏళ్ల తరబడి నీటి కొరతతో ఇబ్బంది పడ్డ ప్రజలు సమస్య పరిష్కారం కావడంతో ఆనందం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి కృషిచేసిన గ్రామ సర్పంచ్ కి, వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే కి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లేళ్ళ వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు మంగీలాల్ నాయక్, దుద్దుకూరి మధుసూదనరావు, లేళ్ళ అప్పిరెడ్డి, సుమంత్, ఆర్కే నాయుడు, గోపాలరెడ్డి, ప్రియాంక, అల్లడి నరసింహారావు, బాదావత్ రామకోటి, నాగరాజు తో పాటు వివిధ శాఖల మండల అధికారులు, పలు గ్రామాల సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.



# రైతు సంక్షేమ ప్రభుత్వం

నేలకొండపల్లి, జూన్ 1 మహా: తెలంగాణ రైతు సంక్షేమ ప్రభుత్వమని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కొన్నారు. స్థానిక రైతు వేదిక లో నేలకొండపల్లి సొసైటీ ఆధ్వర్యంలో సబ్సిడీ పై జీలుగులు పంపిణీ చేశారు. సోమవారం విత్తనాల పంపిణీ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...రైతును రాజు గా చూడలనే లక్ష్యంతో ప్రభుత్వం రైతుల కోసం అనేక పథకాలు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. బోనస్, మద్దతు ధర, సబ్సిడీ పై విత్తనాలు, యంత్ర పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. సొసైటీల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలను పొంది...సాగులో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. రైతులు సబ్సిడీ ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ తీగ రమణయ్య, మండల వ్యవసాయాధికారి యం. రాధ. సొసైటీ కార్యదర్శి బమ్మం వెంకటేశ్వరు. కనపర్తి నాగేందర్, ఏఈవో లు దుర్గాభవాని, శిరీషా, అరవింద్, రైతు ప్రతినిధులు నల్లాని మల్లిఖార్జునావు, ఉండమోదుగుల శ్రీను, రాము, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు



# రాష్ట్ర స్థాయి హిస్టరీ బుక్ కమిటీలో లెక్చరర్ తమ్మిశెట్టి

**కారేపల్లి కాలేజీ హిస్టరీ లెక్చరర్ కు దక్కిన గౌరవం**

**కారేపల్లి, మహా**:కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల చరిత్ర అధ్యాపకులు తమ్మిశెట్టి శ్రీనివాస్ రాష్ట్రస్థాయి హిస్టరీ టెక్స్ బుక్ కమిటీ లో సెలెక్ట్ అయ్యారు. కమిటీలో 9 మంది ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ఉండగా తమ్మిశెట్టి శ్రీనివాస్ ఒక్కరే కమిటీలో ఏకైక అధ్యాపకులు. ఐదేళ్లపాటు ఉండే ఈ కమిటీలో గత ఐదేళ్ల కాలం కమిటీలో కూడా ఉన్నారు. ఇంటర్ ఫస్టియర్ హిస్టరీ బుక్ లో 12 వ లెసన్ జాతీయోద్యమం లెక్చరర్ శ్రీనివాస్ రాసిందే.దీంతో పాటు సిలబస్ కమిటీలో కూడా హిస్టరీ అధ్యాపకునికి స్థానం లభించింది. ఈ సందర్భంగా తమ్మిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ.. నా ప్రతిభను గుర్తించి రాష్ట్రస్థాయి హిస్టరీ బుక్ కమిటీలో అవకాశం కల్పించిన గత ఇంటర్ బోర్డు కమిషనర్ కృష్ణ ఆదిత్య, ప్రస్తుత కమిషనర్ అభిలాష్ అభినవ్, తెలుగు అకాడమీ డైరెక్టర్ వెంకటేశం కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి కమిటీ లో కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ హిస్టరీ లెక్చరర్ ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక బృందం, విద్యార్థులు
హర్షం వ్యక్తం చేశారు.



# అగ్నికి ఆహుతైన వరిగడ్డి వాము..

**రూ.1.50 లక్షల ఆస్తి నష్టం..**

**మణుగూరు, మహా** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని మణికంఠ నగర్ గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో రైతు మల్లీడి భాస్కర్‌కు చెందిన వరిగడ్డి వాము, పశువుల షెడ్డు దగ్ధమయ్యాయి. ప్రమాదంలో సుమారు 550 వరిగడ్డి కట్టలు పూర్తిగా కాలిపోగా, రేకులతో నిర్మించిన పశువుల షెడ్డు కూడా మంటలకు ఆహుతైంది. ఇందుకు సంబంధించి స్థానికుల సమాచారం మేరకు మంటలు ఒక్కసారిగా చెలరేగి వేగంగా వ్యాపించడంతో వరిగడ్డి వాము పూర్తిగా దగ్ధమైంది. గ్రామస్థులు, ఫైర్ సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే భారీ నష్టం సంభవించింది. ఈ ఘటనలో సుమారు రూ.1.50 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత రైతు మల్లీడి భాస్కర్ తెలిపారు. అగ్నిప్రమాద విషయం తెలుసుకున్న గ్రామ పెద్దలు, రైతులు సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధిత రైతును పరామర్శించారు. ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు నష్టాన్ని అంచనా వేసి తగిన ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్థులు కోరారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదని, దీనిపై అధికారులు విచారణ చేపట్టనున్నట్లు సమాచారం.




# పాలకుర్తి మండలంలో బాధ్యతలు స్వీకరించిన నూతన ఏ.ఈ.ఓలు

పాలకుర్తి,జూన్ 1 పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో నూతనంగా బదిలీపై వచ్చిన ఇద్దరు వ్యవసాయ విస్తరణ అధికారులు (AEOs) సోమవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ మేరకు మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. గత కొంతకాలంగా ఇక్కడ పనిచేస్తున్న బి. శశిధర్ ముత్తారం మండలం మైదాబండ క్లస్టర్‌కు బదిలీ కాగా, వారి స్థానంలో మానేల సువర్ణరేఖ పాలకుర్తి, ఎలకలపల్లి క్లస్టర్ పరిధిలో నూతన ఏ.ఈ.ఓగా బాధ్యతలు చేపట్టారు. అలాగే, రెగ్యులర్ ఏ.ఈ.ఓగా కుమ్మం శ్రీకాంత్ నియమితులయ్యారు. పుట్నూర్, జయ్యారం క్లస్టర్ల బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన అధికారులు మాట్లాడుతూ.మండలంలోని రైతులందరికీ పంట నమోదు, రైతు భరోసా, రైతు బీమా, సబ్సిడీ విత్తనాలు మరియు ఎరువుల వంటి ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా, సకాలంలో అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

# ఘనంగా 'ఇందిరమ్మ' గృహ ప్రవేశాలు

**రామగుండం మహా:** నియోజకవర్గంలోని బసంత్ నగర్, పాలకుర్తి, కొత్తపల్లి, రామారావుపల్లి మరియు గోలివాడ గ్రామాల్లో నిర్మించిన 'ఇందిరమ్మ ఇండ్ల' గృహ ప్రవేశ కార్యక్రమం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, నూతన గృహాల్లోకి అడుగుపెట్టిన లబ్ధిదారులకు గృహ ప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయాలనేదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు గౌరవప్రదమైన జీవనం గడపడానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో దోహదపడుతుంది. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నాం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాలకుర్తి మండల అధ్యక్షులు ముక్కర శ్రీనివాస్ ,మార్కెట్ చైర్మన్ గడ్డం తిరుపతి, డిసిసి ప్రధాన కార్యదర్శి సుర సమ్మయ్య, సర్పంచ్ పెద్ద పెళ్లి తిరుమల, ఉప సర్పంచ్ వైద బుగ్గ రామస్వామి ,గ్రామ అధ్యక్షుడు మెరుగు అశోక్ గౌడ్ ,ఉపాధ్యక్షుడు నూకల గట్టయ్య కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిలగాని రాజేశం, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# మణుగూరు ఏరియా ఉత్తమ ఉద్యోగుల ఎంపిక..

- రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ముగ్గురికి గౌరవం..

**మణుగూరు, మహా :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాల సందర్భంగా సింగరేణి మణుగూరు ఏరియాలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు, అధికారుల్లో విశిష్ట సేవలు అందించిన ముగ్గురిని ఉత్తమ ఉద్యోగులు, ఉత్తమ అధికారులుగా ఎంపిక చేశారు. మణుగూరు ఏరియాలో పనిపట్ల నిబద్ధత, వృత్తి నైపుణ్యం, అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను గుర్తించి ఈ అవార్డులను ప్రకటించారు. ఇందులో ఆర్. శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్, మణుగూరు ఏరియా ప్రథమ ఉత్తమ ఉద్యోగి (ఉత్తమ అధికారి)గా ఎంపికయ్యారు. అలాగే గౌరారం నరసింహులు, కన్వేయర్ ఆపరేటర్, కేచీహెచ్‌పీ ఉత్తమ ఉద్యోగిగా ఎంపిక కాగా, ఎం. వెంకట రమణ, డీవైఎస్ఈ (ఈ&ఎం), పీకేఓసీ11కు స్పెషల్ అవార్డు (ఉత్తమ ఉద్యోగి) లభించింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాల సందర్భంగా జూన్ 2 మంగళవారం నిర్వహించే వేడుకల్లో ప్రథమ ఉత్తమ ఉద్యోగిగా ఎంపికైన ఆర్. శ్రీనివాస్ కు కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయంలో జరిగే సెంట్రల్ ఫంక్షన్‌లో ఘనంగా సన్మానించనున్నారు. అదేవిధంగా ఉత్తమ ఉద్యోగిగా ఎంపికైన గౌరారం నరసింహులు, స్పెషల్ అవార్డు గ్రహీత ఎం వెంకట రమణలను మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ చేతుల మీదుగా సన్మానించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అవార్డులకు ఎంపికైన ఉద్యోగులకు సహోద్యోగులు, అధికారులు అభినందనలు తెలిపారు. వారి సేవలు ఇతర ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల సామూహిక గృహప్రవేశాల్లో పాల్గొన్న బీర్ల అయిలయ్య

**ఆలేరు జూన్ 1 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని కొనపురం రేణుక సాయిలు ,అంకిరెడ్డి సమ్మయ్య ,చింత కింది వాణి కుటుంబాల ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు నిర్వహించి గృహప్రవేశం చేయించారు. అనంతరం లబ్ధిదారులకు పట్టు బట్టలు అందజేసి, పాలు పొంగించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, పేద ప్రజలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే లక్ష్యంతముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలేరు బీజాన బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ ఆంజనేయులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు నీలం పద్మ, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీర్ల అయిలయ్య

**ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీర్ల అయిలయ్య**

**యాదాద్రి భువనగిరి జూన్ 1 మహా :** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం నాడు మునుగోడు క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కాంగ్రెస్ నాయకులతో కలిసి రాజగోపాల్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారుఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వేడుకల్లో పాల్గొని రాజగోపాల్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, రాజగోపాల్ రెడ్డి ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేసే నాయకుడని, ప్రజల మధ్య నిరంతరం ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తారని కొనియాడారు. ఆయనకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు.

# జిల్లా కలెక్టర్ ను కలిసిన బల్దియా అడిషనల్ కమిషనర్



మహా వరంగల్ బ్యూరో;ఇటీవల జరిగిన బదిలీల్లో హన్మకొండ మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేస్తూ జీడబ్ల్యూఎంసీ అడిషనల్ కమిషనర్‌గా బదిలీ అయిన ఇసంపెల్లి జోనా సోమవారం హన్మకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయ్‌ను కలెక్టరేట్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇసంపెల్లి జోనాకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. నగరాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవతో పనిచేయాలని ఆకాంక్షించారు.

# ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలం

- పాలకుల నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టండి
- ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేత



మహా వరంగల్ బ్యూరో; ఎం సిపిఐ యు పార్టీ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను తక్షణమే అరికట్టాలని వరంగల్ మండల తహసిల్దార్ శ్రీకాంత్ కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నర్రా ప్రతాపు, ఏఐసిటీయు వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక పేద మధ్య తరగతి సామాన్య ప్రజలపై భారీ ఆర్థిక భారాన్ని మోపుతూ దేశంలో గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను అడ్డు అదుపు లేకుండా పెంచుతూన్నారు తద్వారా నిత్యవసర సరుకులు పాలు కూరగాయలు పండ్లు పప్పు దినుసులు ఇతర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి సామాన్య పేద మధ్య తరగతి ప్రజలు కొనలేని స్థితిలో కొట్టుమిట్టాడుతూ దుర్భరమైన జీవితాలు గడిస్తూ ఆకలి చావులను ఎదుర్కొంటున్నన్నారు ధరలు పెరగడం మూలంగా కార్పొరేట్ శక్తులు పెట్టుబడిదారులు బడా వ్యాపారవేత్తలు కోటీశ్వర్లు అవుతున్నారు. సామాజిక ఆర్థిక దోపిడి పేదరికం నిరుద్యోగం వ్యవసాయ సంక్షోభంలో కురుక పోవడం రైతులకు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలు చేసుకున్న పాలకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు అన్నారు, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి పేపర్ల మీడియా వరకు పెగ్గల్ కొడుతు కార్మిక వర్గాన్ని ప్రజల్ని మోసం చేస్తూ పబ్బం గడుపుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు, ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను అరికట్టి పేదలను ఆదుకోవాలని కార్మిక వ్యతిరేకమైన కొత్త జీవోలను రద్దుచేసి పాత కార్మిక చట్టాలను అమలు చేయాలని లేనియెడల రాబోయే రోజులలో పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, సలీం, జన్ను రమేష్, కుమారస్వామి, మొగిలి, బాలయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు

# వర్షా కాలం ముందస్తు చర్యలు తీసుకోవాలి

**సమీక్షాసమావేశంలో తహసీల్దార్, ఎంపీడీవో**

**కారేపల్లి, మహా :** వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో క్షేత్రస్థాయిలో అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో మల్లెల రవీంద్రప్రసాద్ సూచించారు. సోమవారం సింగరేణి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అన్నిశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో తహసీల్ధార్, ఎంపీడీవో లు మాట్లాడుతూ గత ఏడాది వర్షాకాలంలో నీటి ముంపు కు గురై నీరు రోడ్లపై, లో లెవెల్ బ్రిడ్జిలపై ప్రవహించటం,అండర్గ్రౌండ్ బ్రిడ్జి వంటివి 14 ప్రాంతాలను గుర్తించటం జరిగిందన్నారు. పాడుబడ్డ ఇండ్లను గుర్తించి ఆ ఆవాసాలలో ఉండకుండా చైతన్యం తేసి వారిని రీహాబిటేషన్ సెంటర్ కు తరలించాలని కోరారు. వర్షాకాలంలో కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్స్, 11 కేవీ లైన్ల కు దూరంగా ఉండేలా గ్రామస్తులకు సూచనలు చేయాలన్నారు. నీటి ట్యాంకులను శుభ్రపరిచి ప్రతి ట్యాంక్లో క్లోరినేషన్ చేయాలని, శానిటేషన్ కు బ్లీచింగ్, సున్నం ప్రతి గ్రామపంచాయితీలో స్టాక్ ఉండాలని కార్యదర్శులను కోరారు. పీఆర్ ఏఈ రాజశేఖర్, ఆర్‌బ్ల్యూఎస్ ఏఈ నరేందర్ రావు, ఐబీ ఏఈ నాగయ్య, హౌసింగ్ ఏఈ నాగేంద్రబాబు, ట్రాన్స్‌కో ఏఈ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో విస్తృతంగా పర్యటించిన మనిషా లక్ష్మి

**కారేపల్లి, మహా :** టీఆర్ఎస్ అధిష్ఠానం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతి నాయకుడు, కార్యకర్త భాగస్వాములు కావాలని వైరా దివగంత మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ తనయ బానోత్ మనిషాలక్ష్మి కోరారు. సోమవారం కారేపల్లి మండలంలో పర్యటించారు. భాగ్యనగర్‌తండా లో నూతనంగా ఏర్పాటు చేసిన కేకే ఫెర్టిలైజర్ షాపును ఆమె ప్రారంభిచారు. కారేపల్లి లో ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న తెలంగాణ ఉద్యమకారుడు సోమందుల నాగరాజును పరామర్శించి ఆరోగ్యం పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. జిల్లా మైనారిటీ నాయకులు షేక్ గౌసుద్దీన్ ఇంట్లో పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. బీఆరఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక పై నాయకులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వాంకుడోత్ జగన్ నాయక్, బీఆరఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ బన్సీలాల్, నాయకులు డొంకెన రవీందర్, ఇస్లావచ్ సుజాత, జర్పుల హచ్చు, బానోత్ మోహన్, జడల కళ్యాణ్, ధారావత్ వికాస్, బానోత్ రాజేష్, మణికొండ నాగేశ్వరరావు, తెలగొర్ల రామారావు, గంగరబోయిన మురళి, పేర్ని వెంకటేశ్వర్లు, పొడుగు హరీష్, రమేష్, మూతి కోటేశ్వరరావు, అజ్మీర రవి, వెంకట్, ఖలీలుల్లాఖాన్, సురేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ హాస్టల్ లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

- అధికారుల ఆదేశించిన జిల్లా కలెక్టర్
- యాదాద్రి భువనగిరి జూన్ 1 మహా

యాదాద్రి భువనగిరి జిల్లాలో పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, అక్కడ ఉన్న సౌకర్యాలు, మౌలిక వసతులు, మరమ్మతుల అవసరాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ఫర్నిచర్ తదితర వివరాలను ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత స్పెషల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో మండల స్పెషల్ అధికారులకు ఆన్‌లైన్ యాప్ వినియోగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, నమోదు చేసిన వివరాల ఆధారంగా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అధికారులు నిర్దేశిత గడువులోగా సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు.

# తెలంగాణ చరిత్రను గౌరవించాలి

- తెలంగాణ ప్రజల మనోభావాలను అర్థం చేసుకోవాలి
- సంగిశెట్టి క్రిస్టఫర్ మలిదశ ఉద్యమకారుడు

**వలిగొండ జూన్ 1 మహా న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో వ్యతిరేకించిన వారు ఇప్పుడు ఉద్యమ ఫలితాలపై ప్రేమ చూపించడం రాజకీ అవసరం కావచ్చు కానీ తెలంగాణ ప్రజలకు అసలు ముఖాలు బాగా గుర్తున్నాయని మలిదశ ఉద్యమకారుడు టియు జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు . తెలంగాణను ప్రేమించడం ఒకటే సరిపోదని తెలంగాణ చరిత్రను గౌరవించాలని తెలంగాణ ప్రజల మనోభావాలను అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు తెలంగాణ ఉద్యమం అంటే ఒక ప్రాంతం కోసం జరిగిన పోరాటం మాత్రమే కాదని అది ఆత్మగౌరవం స్వయంపాలన హక్కుల కోసం సాగిన ప్రజా ఉద్యమం అని ఆ ఉద్యమానికి అండగా నిలిచింది ఎవరు అడ్డుపడిందెవరు తెలంగాణ ప్రజలకు తెలుసని ఆయన గుర్తు చేశారు తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రశ్నించే ప్రయత్నాలను తెలంగాణ ప్రజలకు నీతులు చెప్పే ధోరణిని ఈ నేల ఎన్నడ ఆమోదించదని తెలంగాణ భవిష్యతి నిర్ణయించే హక్కు తెలంగాణ ప్రజలకే ఉందని ఆయన అన్నారు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన రోజులను ఈ నేల ప్రజలు మర్చిపోలేదని తెలంగాణ ఏర్పడితే నష్టమని వాదించిన వారు ఉద్యమ ఆకాంక్షలను తక్కువ చేసి మాట్లాడిన వారు నేడు తెలంగాణ పై ప్రేమ ఒలకపోయడం పోయడం రాజకీయ సౌలభ్యం తప్ప మరొకటికాదని ఆయన అన్నారు

# అంతిమ సంస్కారాల కోసం ప్రత్యేక వసతుల ఏర్పాటు

**పద్మాక్షి శివ ముక్తి ధామ్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే నాయిని, కుడా చైర్మన్, కలెక్టర్**



**మహా వరంగల్ బ్యూరో;** సుదూర ప్రాంతాల నుంచి జీవనోపాధి కోసం వరంగల్ మహానగరానికి వచ్చి కిరాయి ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలు తమ ఆత్మీయులను కోల్పోయిన సమయంలో అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఆ సమస్యను గుర్తించిన అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ అనిత రెడ్డి విషయాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే, సమస్యను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ నేపథ్యంలో సోమవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ,జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, కుడా సంబంధిత అధికారులతో కలిసి పద్మాక్షి శివ ముక్తి ధామ్ స్థలాన్ని పరిశీలించారు. నిరుపేదలు, వలస కార్మిక కుటుంబాలు తమ ఆత్మీయులకు గౌరవప్రదంగా అంతిమ సంస్కారాలు నిర్వహించుకునేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు.పుల్లూరి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, ప్రముఖ సామాజిక సేవావేత్త అనిత రెడ్డి, పలువురు స్వచ్ఛంద సేవకులు పాల్గొని తమ వంతు సహకారం అందించేందుకు ముందుకు వచ్చారు.ప్రజల అవసరాలను గుర్తించి మానవతా దృక్పథంతో స్పందించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఈ వసతులు అందుబాటులోకి వస్తే ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఎంతో ఊరట కలుగుతుందని, తమ ఆత్మీయులకు గౌరవప్రదంగా అంతిమ సంస్కారాలు నిర్వహించే అవకాశం లభిస్తుందని పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.



# ప్రజావాణికి 89 అర్జీలు

**యాదాద్రి భువనగిరి జూన్ 1 మహా** వివిధ సమస్యలపై ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, తో కలిసి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 89 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 46, జిల్లా గ్రామీణాభివృది 8, డివిజనల్ పంచాయతీ 5, మున్సిపాలిటీ 4, పి డి హౌసింగ్ 3, సివిల్ సప్లై 2, మైనింగ్ 2, సర్వే ల్యాండ్ 2, జిల్లా పరిషత్ 2, ఇరిగేషన్ 2, ఎలక్ట్రిసిటీ, ఎక్సైజ్ పర్సంవర్ధక, యస్ సి కార్పొరేషన్, శిశు సంక్షేమ, బీసీ వెల్ఫేర్, ఎంప్లాయిమెంట్ , మత్స్య, చేనేత, అగ్రికల్చర్, విద్య, లీగల్ సెల్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లు పూర్తి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**యాదాద్రి భువనగిరి జూన్ 1 మహా** జూన్'2 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు.సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పనులను కలెక్టర్, అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో పాటు కలసి ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్... వేడుకలు నిర్వహించే ప్రాంగణం, జెండా ఆవిష్కరణ స్థలం, పోలీస్ పరేడ్ గ్రౌండ్ ఏర్పాట్లు, విద్యుత్, పారిశుధ్య సౌకర్యాలు, మీడియా పాయింట్ ,తదితర అంశాలను పరిశీలించారు. కలెక్టర్ అధికారులకు సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చూడాలన్నారు.

ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో అంజిరెడ్డి , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# మదర్ డైరీ చైర్మన్ గా ఐలి కృష్ణ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నిక

**ఆలేరు జూన్ 1 మహా** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొల్లూరు గ్రామ పాల ఉత్పత్తి దారుల సంఘం మదర్ డైరీ నూతన చైర్మన్గా ఐలి కృష్ణగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం రోజున కొల్లూరు పాల సంఘ భవనంలో పాల ఉత్పత్తిదారులు సంఘ డైరెక్టర్లు సమావేశమై ఐలి కృష్ణ గౌడ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ కృష్ణ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి పాడి రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నిక కు సహకరించిన సంఘ డైరెక్టర్లకు పాడి రైతులకు కృతజ్ఞతలు తెలిపారు

# రూ.25 లక్షల ప్యాకేజీ వద్దు.. క్యాబ్ డ్రైవింగే ముద్దు!



జీవితంలో స్థిరపడటానికి ఒక మంచి వైట్ కాలర్ జాబ్, చేతినిండా జీతం ఉంటే చాలని చాలామంది భావిస్తారు. కాలేజీలో ఎంబీఏ పూర్తి చేసి క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లోనే ఏడాదికి రూ.25 లక్షల ప్యాకేజీ ఆఫర్ వస్తే ఎవరైనా ఏం చేస్తారు? కళ్లు మూసుకుని ఆఫర్ లెటర్ అందుకుంటారు. కానీ, ఆ యువకుడు మాత్రం అందరిలా ఆలోచించలేదు. ఆకర్షణీయమైన కార్పొరేట్ ఉద్యోగాన్ని సున్నితంగా తిరస్కరించి స్టీరింగ్ చేతపట్టాడు. 'ఓలా' క్యాబ్ డ్రైవర్‌గా ప్రస్థానాన్ని ప్రారంభించి నేడు ఒక విజయవంతమైన వ్యాపారవేత్తగా ఎదిగిన ఒక యువకుడి స్ఫూర్తిదాయక కథనం ఇప్పుడు సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో వైరల్‌గా మారింది.

### రూ.25 లక్షల ఆఫర్ తిరస్కరణ

సోషల్ మీడియా యూజర్ సచన్ షేర్ చేసిన ఈ పోస్ట్ నెటిజన్లను ఆకట్టుకుంటోంది. సచన్ తెలిపిన వివరాల ప్రకారం.. అతని సోదరుడు మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్ పూర్తి కాగానే ప్రముఖ కార్పొరేట్ సంస్థ నుంచి రూ.25 లక్షల వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగ ఆఫర్ సాధించాడు. అయితే, మొదటి నుంచి కార్పొరేట్ ఉద్యోగాలపై అతనికి ఆసక్తి లేదు. సొంతంగా ఏదైనా సాధించాలనే బలమైన సంకల్పంతో ఆ భారీ ఆఫర్‌ను తిరస్కరించాడు. ఊహించని విధంగా ఓలా క్యాబ్ నడపాలని నిర్ణయించుకున్నాడు.ఈ నిర్ణయం కుటుంబంలో, బంధువుల్లో కలకలం రేపింది. 'లక్షలు ఖర్చు పెట్టి చదివించింది కార్లు తోలడానికా?' అంటూ బంధువులు, సమాజం అతన్ని విమర్శించాయి. ఉన్నత చదువులన్నీ వృధా అయిపోయాయని, భవిష్యత్తును చేతులారా నాశనం చేసుకుంటున్నాడంటూ బహిరంగంగానే ఎగతాళి చేశారు. కానీ, ఆ యువకుడు తన లక్ష్యంపై నమ్మకంతో ముందడుగు వేశాడు.

### డ్రైవర్ స్థాయి నుంచి ఫ్లీట్ ఓనర్ వరకు..

సమాజం అతన్ని కేవలం ఒక 'క్యాబ్ డ్రైవర్'గా మాత్రమే చూసింది. కానీ సదరు ఎంబీఏ గ్రాడ్యుయేట్ మాత్రం అందులోనే ఒక అద్భుతమైన వ్యాపార అవకాశాన్ని చూశాడు. కేవలం డ్రైవింగ్‌కే పరిమితం కాకుండా లాజిస్టిక్స్, రవాణా రంగాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. గడిచిన మూడేళ్ల కాలంలో క్రమంగా తన వ్యాపారాన్ని విస్తరిస్తూ వెళ్లాడు. సొంతంగా అదనపు వాహనాలను కొనుగోలు చేస్తూ వాటిని నిర్వహించడం ప్రారంభించాడు. సచన్ వెల్లడించిన సమాచారం ప్రకారం.. ప్రస్తుతం అతని సోదరుడు ఓలా ప్లాట్‌ఫారమ్ కింద ఏకంగా 5 కార్లను నడుపుతున్నాడు. అన్ని ఖర్చులు పోను నెలకు సుమారు రూ.1.5 లక్షల నికర ఆదాయాన్ని ఆర్జిస్తున్నాడు.

### నెటిజన్ల మధ్య భిన్నాభిప్రాయాలు

ఈ వైరల్ పోస్ట్ కెరీర్ ఎంపికలపై నెటిజన్ల మధ్య చర్చకు తెరలేపింది. ఈ ప్రయాణాన్ని విశ్లేషిస్తూ సోషల్ మీడియా వేదికగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సాంప్రదాయక వైట్ కాలర్ ఉద్యోగాల చట్రం నుంచి బయటకు వచ్చి స్వేచ్ఛను, స్వయం ఉపాధిని ఎంచుకున్న సదరు యువకుడి సాహసాన్ని అత్యధికులు అభినందిస్తున్నారు. మరికొందరు నెటిజన్లు భిన్నంగా స్పందించారు. రూ.25 లక్షల కార్పొరేట్ ఉద్యోగంలో చేరి ఉంటే, మూడేళ్ల అనుభవం తర్వాత ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లతో అంతకంటే ఎక్కువ ఆదాయం వచ్చేదని అభిప్రాయపడ్డారు. కొంతమంది యూజర్లు ఈ ఆదాయ గణాంకాలను ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో ఐదు కార్లపై నెలకు రూ.1.5 లక్షల నికర లాభం (అన్ని ఖర్చులు, డ్రైవర్ల జీతాలు పోను) సాధించడం అంత సులువు కాదని, దీనికి సంబంధించిన ఆధారాలు ఉంటే బాగుంటుందన్నారు.

# ఐటీఆర్ ఫారం 2 రెడీగా ఉంది..

గత వారం నుంచి ఆదాయపు పన్ను వారి ఈ-ఫైలింగ్ పోర్టల్‌లో ఫారాలను ఎనేబుల్ చేస్తున్నారు. మనం గతంలో ఫారం 1, ఫారం 4 గురించి తెలుసుకున్నాం. లేటెస్టుగా ఫారం 2 రెడీగా ఉంది. వివరాల్లోకి వెళ్దాం.

### ఈ ఫారం ఎవరు దాఖలు చేయాలి?

వ్యక్తులు, హిందూ ఉమ్మడి కుటుంబాలు మాత్రమే ఐటీఆర్ ఫారం 2ను వేయగలరు. ఇతరులెవ్వరూ ఈ ఫారం ద్వారా తమ ఆదాయాలను డిక్లేర్ చేయకూడదు. ఐటీఆర్ ఫారం 1 వేయకూడనివారు (వేయలేకపోవడం కాదు.. వేయడానికి అర్హత లేని వారు), అలాగే బిజినెస్/వృత్తిపై లాభనష్టాలు ఉండని వారు మాత్రమే ఈ ఫారం దాఖలు చేయడానికి అర్హులు.

### ఏయే ఆదాయాలున్నవారు వేయొచ్చు..

- మూలధన లాభాలు (దీర్ఘకాలిక, స్వల్పకాలిక).
- ఒక ఇంటి ఆస్తి మీద, ఎక్కువ ఆస్తుల మీద ఆదాయం ఉన్నవారు
- విదేశీ ఆస్తుల మీద ఆదాయం
- విదేశాల నుంచి ఆదాయం
- జీతాలు / పెన్షన్
- ఇతర ఆదాయాలు, లాటరీలు, గుర్రపు పందాలు, గ్యాంబ్లింగ్ వగైరా ఆదాయాలు ఉన్నవారు
- వ్యవసాయం మీద ఆదాయం రూ. 5,000 దాటిన వారు
- మొత్తం ఆదాయం పరిమితి రూ. 50,00,000 దాటినవారు
- డైరెక్టర్స్
- అన్‌లిస్టెడ్ ఈక్విటీ వాటాల్లో ఇన్వెస్ట్ చేసినవారు

### ఏ ఆదాయం ఉన్నవారు వేయకూడదు..

వ్యక్తులు కానీ / హిందు ఉమ్మడి కుటుంబాలకు వ్యాపారం మీద / వృత్తి మీద ఆదాయం ఉన్నవారు ఫారం 2 వేయకూడదు.

### గడువు తేదీ ఎప్పుడు

ఈ ఫారం దాఖలు చేయడానికి గడువు తేదీ 2026 జూలై 31.

### తెలుసుకోవాల్సిన, తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఈ ఫారం ఆన్‌లైన్‌లో గానీ ఆఫ్‌లైన్‌లో గానీ వేసుకోవచ్చు. ఈ కింద చెప్పబోయే విషయాల్లో పాత చట్టంలో పేర్కొన్న పేరు, ఫారాలను వాడుతున్నాం.

- యజమాని జారీ చేసిన ఫారం 16
- వివిధ డిడక్టర్లు జారీ చేసిన ఫారం 16ఏ
- టీడీఎస్ వెరిఫికేషన్ కోసం ఫారం 26ఏఎస్
- ఇంటద్దె రశీదులు, ఒక్కొక్కప్పుడు యజమాని తీసుకోకపోయినా / పరిగణించకపోయినా మీరు డైరెక్టుగా క్లెయిమ్ చేయొచ్చు
- బ్యాంకు పాస్‌బుక్స్ లేదా బ్యాంకు వాళ్లు ఇచ్చిన స్టేట్‌మెంట్లు
- ఫిక్స్‌డ్ డిపాజిట్ల రశీదులు
- క్యాపిటల్ గెయిన్స్ - దీర్ఘకాలికమైనవైతే ఆస్తుల అన్ని వివరాలు, కాగితాలు, రశీదులు మొదలైనవి
- క్యాపిటల్ గెయిన్స్ స్వల్పకాలికమైనా, ఆస్తులకు సంబంధించిన వివరాలు, కాగితాలు, రశీదులు
- షేర్లు, మ్యూచువల్ ఫండ్స్‌కి సంబంధించి బ్రోకింగ్ సంస్థలు / ఏజెన్సీలు జారీ చేసిన స్టేట్‌మెంట్లు, సర్టిఫికెట్లు మొదలైనవి
- పాత పద్ధతిలో పన్నుభారం లెక్కించే విధానం ఎంపికలో 80సి, జీ, డి, జీజీ ఇలాంటి మినహాయింపులకు సంబంధించి కాగితాలు, నంబర్లు, వివరాల విషయంలో దయచేసి చాలా జాగ్రత్త వహించండి.

**షరా:** కాగితాలు జతపర్చుకోనక్కర్లేదు, కానీ భద్రపరచాలి. వాటిలోని వివరాలు తెలియజేయాలి.




### కొత్త మార్పులు

ప్రత్యేకించి 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రిటర్నుల్లో సమాచారపరంగా వచ్చిన మార్పులు ఏమిటంటే, స్వల్పకాలిక క్యాపిటల్ గెయిన్స్ 15 శాతం కొన్ని, 10 శాతం కొన్ని ఉండేవి. కానీ ఇప్పుడు అన్నింటికీ ఒకే రేటు. తికమక ఉండదు. రివైజ్ రిటర్నుకి సంబంధించిన ఫీజు వివరాలు ఇవ్వాలి. 80సీ, 80డీ మొదలైన వాటి విషయాల్లో ప్రత్యేకంగా 80జీజీసీ వ్యవహారపు వివరాలు/రిఫరెన్సు, పాన్ నంబరు ఇవ్వాలి. రిప్రజెంటేటివ్ అసెసీ వివరాల్లో పేరు, మెయిల్ ఐడీ, ఫోన్ నంబర్లు తెలియజేస్తే చాలు.

# ఫిన్‌టెక్ సేవల్లోకి ఎల్ఐసీ




ప్రభుత్వరంగ జీవితబీమా సంస్థ ఎల్ఐసీ డిజిటల్ సేవలను పెద్ద ఎత్తున విస్తరించడంపై దృష్టి సారించింది. ఒక ఫిన్‌టెక్ సంస్థను ఏర్పాటు చేయడాన్ని చురుగ్గా పరిశీలిస్తోంది. పెరుగుతున్న డిజిటల్ సేవల అవసరాలను తీర్చేందుకు అవసరమైతే ప్రత్యేకమైన సేవలు అందించే సంస్థలో వ్యూహాత్మక పెట్టుబడిని సైతం పరిశీలిస్తున్నట్టు సంస్థ సీఈవో, ఎండీ ఆర్. దొరైస్వామి తెలిపారు. 'సహజంగా ఆధునికీకరణ అవసరాలు, కొత్త ఆవిష్కరణల కోసం మేము ఫిన్‌టెక్, ఇన్సూర్‌టెక్ సంస్థలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు నిర్వహిస్తుంటాం. ఈ సంస్థల ద్వారా పలు కొత్త విషయాలను తెలుసుకుంటుంటాం. పెద్ద ఆర్థిక సంస్థగా పలు కంపెనీల్లో పెట్టుబడులు కూడా పెడుతుంటాం. పాలసీదారుల రాబడులను మెరుగుపరిచేందుకు అవసరమనుకుంటే ప్రత్యేకమైన సంస్థలో వ్యూహాత్మక పెట్టుబడులనూ పరిశీలిస్తాం' అని దొరైస్వామి తెలిపారు.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



### మరో వివాదంలో ఎన్‌టీఏ..
# దుమ్మెత్తిపోస్తున్న విద్యార్థులు


**న్యూఢిల్లీ:** 'నీట్ యూజీ' పరీక్ష నిర్వహణ వైఫల్యంతో ఇప్పటికే పలు విమర్శలను ఎదుర్కొంటున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని ఇప్పుడు మరో సమస్య చుట్టుముట్టింది. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్ ఐఏటీ) ప్రవేశ పరీక్షలను ఎన్‌టీఏ ఒకే రోజున అంటే జూన్ 7వ తేదీనే నిర్వహిస్తుండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు జాతీయ స్థాయి పరీక్షలు ఒకే రోజు ఉండటంతో, తాము దేనిని ఎంచుకోవాలో తెలియక అభ్యర్థులు సతమతమవుతున్నారు.

### పరీక్షల తేదీల క్లాష్‌తో సందిగ్ధంలో విద్యార్థులు

దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశం కోసం లక్షలాది మంది విద్యార్థులు ఈ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. అయితే, జూన్ 7న ఈ రెండు పరీక్షలు ఒకే సమయంలో జరగడం వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతోంది. ఇప్పటికే పరీక్షల వాయిదాలతో ఒత్తిడికి గురైన విద్యార్థులకు, ఈ తేదీల వ్యవహారం తలనొప్పిగా మారింది. ఒకే సమయంలో రెండు వేర్వేరు పరీక్షా కేంద్రాలకు వెళ్లడం అసాధ్యమని, దీనిపై అధికారులు స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని తల్లిదండ్రులు సోషల్ మీడియా వేదికగా కోరుతున్నారు.

### ఎన్‌టీఏ తక్షణ స్పందన

ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) స్పందించింది. పరీక్షా షెడ్యూల్ విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అభ్యర్థి వివరాలను వెంటనే cuetug@nta.ac.in ఈమెయిల్ ద్వారా పంపాలని ఎన్‌టీఏ సూచించింది. అభ్యర్థులకు తగిన సహాయం చేస్తామని హామీ ఇచ్చింది.



### మొదలైన విమర్శలు, ఆందోళనలు

ఇప్పటికే సీయూఈటీయూజీ పరీక్షా నిర్వహణలో సాంకేతిక లోపాలు, బయోమెట్రిక్ సమస్యల కారణంగా వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు తాజాగా చోటుచేసుకున్న ఈ తేదీల వివాదంతో ఎన్‌టీఏ తీరుపై మరిన్ని విమర్శలు వినిపిస్తున్నాయి. భవిష్యత్తులో ఇటువంటి పొరపాట్లు జరగకుండా అధికారులు ముందుగానే సమన్వయం చేసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్‌టీఏ ఈ పరీక్షల విషయంలో ఎటువంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తుందోనని విద్యార్థులు వేచి చూస్తున్నారు.

# 40 మంది ఐఏఎస్‌ల బదిలీ

**తిరువొత్తియూరు:** తమిళనాడు ప్రభుత్వం 40 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, చెన్నై కలెక్టర్‌తో సహా మరికొంతమంది ఐఏఎస్ అధికారుల ను బదిలీ చేస్తూ ఆదేశాలిచ్చింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయికుమార్ విడుదల చేసిన ఉత్తర్వుల మేరకు.. గవర్నర్ ముఖ్య కార్యదర్శిగా ఉన్న కిర్లోష్ కుమార్, గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా బదిలీ అయ్యారు. సామాజిక సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ శరణ్య అరి, పెరంబలూరు జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. పెరంబలూరు జిల్లా కలెక్టర్ మృణాళిని, అరియలూరు జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. చెంగల్పట్టు జిల్లా మాజీ కలెక్టర్ మాలతి హెలెన్, చెన్నై జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. కోయంబత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శివగురు ప్రభాకరన్, రామనాథపురం జిల్లా కలెక్టర్ గా బదిలీ అయ్యారు. తమిళనాడు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. కవిత, తిరువళ్లూరు జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. మదురై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చిత్ర విజయన్, చెన్నై మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ డిప్యూటీ కమిషనర్ (నార్త్)గా బదిలీ అయ్యారు. ప్రభుత్వ పరిపాలన శాఖ డిప్యూటీ సెక్రటరీ వీరప్రతాప్ సింగ్, తిరుచ్చి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమితులయ్యారు. చెన్నై మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కవరాజ్ కుమార్, మదురై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. చెన్నై మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ డిప్యూటీ కమిషనర్ (నార్త్) కట్టా రవి తేజ, కోయంబత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమితులయ్యారు.




# 'పహల్గామ్' ఉగ్రవాదులకు పాక్ బ్యాంక్ అండ?

**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో గల బైసారన్ వ్యాలీలో గత ఏడాది జరిగిన ఉగ్రదాడి దర్యాప్తులో కొత్త కోణాలు వెలుగులోకి వచ్చాయి. ఈ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన దరిమిలా భారత సైన్యం చేతుల్లో హతమైన ముగ్గురు ఉగ్రవాదుల వద్ద దొరికిన రెండు స్మార్ట్‌ఫోన్‌లను దర్యాప్తు సంస్థలు స్వాధీనం చేసుకున్నాయ. ఎన్ఐఏ, జమ్మూ కాశ్మీర్ పోలీసులు జరిపిన దర్యాప్తులో, ఆ ఫోన్‌లు పాకిస్తాన్‌కు చెందిన ఒక ప్రముఖ బ్యాంకు ద్వారా అందినట్లు తేలింది. ఈ బ్యాంకు గతంలో కూడా లష్కర్ ఏ తోయిబా వంటి ఉగ్రవాద సంస్థలకు నిధులు మళ్లించినట్లు ఆరోపణలు ఎదుర్కొంది. బ్యాంకు చిరునామాలో ఉగ్రవాద ఫోన్లు షావోమీ గ్లోబల్ అందించిన సమాచారం ప్రకారం, ఉగ్రవాదులు వాడిన ఫోన్లలో ఒకటి 2021లో పాకిస్తాన్‌కు చెందిన 'టెక్ సిరాత్ ప్రైవేట్ లిమిటెడ్' ద్వారా అందుకున్నారు. దీనికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలను పాకిస్తాన్‌కు చెందిన 'ఫైసల్ బ్యాంక్' నిర్వహించింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ ఫోన్ల డెలివరీ చిరునామా కరాచీలోని ఫైసల్ బ్యాంక్ ప్రధాన కార్యాలయానిది. భారీ కన్సైన్‌మెంట్‌లకు బ్యాంకులు లెటర్ ఆఫ్ క్రెడిట్ అందించడం సాధారణమే అయినప్పటికీ, ఆ కన్సైన్‌మెంట్ నుండి ఈ ఫోన్ అక్రమంగా బయటకు వచ్చి, ఉగ్రవాదుల చేతికి చిక్కడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ ఫోన్ల దర్యాప్తులో మరో సంచలన విషయం బయటపడింది. ఇవి 2021, 2023లో పాకిస్తాన్‌కు చేరినప్పటికీ, పహల్గామ్ దాడికి కొద్ది రోజుల ముందు వరకు ఎప్పుడూ వీటిని ఆన్ చేయలేదు. ఉగ్రవాదులను ప్రత్యేకంగా లక్షిత దాడుల కోసం వీటిని సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అలాగే ఈ ఉగ్రవాదులు సాధారణ నెట్‌వర్క్‌లను కాకుండా, సుదూర ప్రాంతాల్లో సురక్షితంగా సమాచారం పంచుకోవడానికి రేడియో కమ్యూనికేషన్ టెక్నాలజీని ఉపయోగించినట్లు గుర్తించారు. దాడికి వారం రోజుల ముందే ఉగ్రవాదులు ఏర్పాటు చేసుకున్న టెంట్ ఫోటోలు, మ్యాప్‌లు ఈ ఫోన్లలో లభ్యమయ్యాయి. ఇది వారి ముందస్తు ప్రణాళికను తెలియజేస్తోంది.




### హనీమూన్ ట్రిప్..
### కుప్పకూలిన హెలికాప్టర్



**వాషింగ్టన్ డీసీ:** అమెరికాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. వివాహమయి ఒకరోజైనా గడవకముందే హెలికాప్టర్ ప్రమాదంలో పెళ్లికొడుకు దుర్మరణం చెందాడు. పెళ్లికూతురుకు తీవ్ర గాయాలయ్యాయి. దంపతులిద్దరూ భారత సంతతికి చెందిన వ్యక్తులుగా తెలుస్తోంది. కేరళకు చెందిన దేవ్ ఫిజీ, జెస్నీలు అట్లాంటాలో స్థిరపడ్డారు. జార్జియాలోని డాసన్ కౌంటీలో వీరి వివాహం వివాహం ఎంతో వైభవంగా జరిగింది. ఆ వేడుక అనంతరం ఈ కొత్త జంట 'రాబిన్సన్ R66' రకం హెలికాప్టర్‌లో సరదాగా బయలుదేరారు. అయితే, డాసన్‌విల్లేలోని 24 మౌంట్ వెర్నాన్ డ్రైవ్ సమీపంలోకి రాగానే ఆ హెలికాప్టర్ ఒక్కసారిగా ప్రమాదానికి గురై కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో పెళ్లికొడుకుతో పాటు పైలట్ అక్కడికక్కడే మృతిచెందగా, పెళ్లికూతురుకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. దీంతో ప్రమాద వివరాలు తెలుసుకున్న సహాయక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని ఆసుపత్రికి తరలించారు. వివాహం చేసుకొని కొత్త జీవితం ప్రారంభించాల్సిన సమయంలో ఈ ప్రమాదం జరగడంతో దంపతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. అయితే ఈ ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. సంఘటన జరిగిన ప్రాంతంలో వాతావరణం అనుకూలించకపోవడమే దీనికి ప్రధాన కారణం కావచ్చని స్థానిక అధికారులు భావిస్తున్నారు.

# షుగర్, గుండె జబ్బుల మందులు ఇక తక్కువ ధరకే!

**న్యూఢిల్లీ:** సాధారణ ప్రజలపై మందుల ఖర్చు భారాన్ని తగ్గించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ)తాజాగా 30 రకాల ఔషధాల గరిష్ఠ చిల్లర ధరలను ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. డ్రగ్స్ (ప్రైసెస్ కంట్రోల్) ఆర్డర్, 2013 నిబంధనల మేరకు, డయాబెటిస్, గుండె సంబంధిత సమస్యలు, అలర్జీలు, విటమిన్ లోపాల చికిత్సలో వాడే మందులను ఈ ధరల నియంత్రణ జాబితాలో చేర్చారు.

### అందుబాటులోకి రానున్న ముఖ్యమైన మందులు

కొత్తగా ధరలు ఖరారు చేసిన వాటిలో గుండె ఆరోగ్యం, కొలెస్ట్రాల్ నియంత్రణ కోసం వాడే అటోర్వాస్టాటిన్, ఫెనోఫైబ్రేట్ మాత్రలు ఒక్కొక్కటి రూ. 18.46కు లభిస్తాయి. అలర్జీల కోసం వాడే బిలాస్టిన్, మోంటెలుకాస్ట్ మాత్ర ధర రూ. 21.22గా నిర్ణయించారు. అలాగే హైపర్ టెన్షన్ రోగుల కోసం బిసోప్రోలోల్ ఫ్యూమరేట్, అమ్లోడిపైన్ మాత్ర రూ. 9.40కు అందుబాటులో ఉంటాయి. ఇక డయాబెటిస్ బాధితుల కోసం ఎంపగ్లిఫ్లోజిన్, సిటాగ్లిప్టిన్ వంటి కీలక కాంబినేషన్ మాత్రల ధరను రూ. 11.91 నుండి రూ. 14.88 లోపుగా నిర్ణయించారు.

### అవయవ మార్పిడి రోగులకు ఊరట

కేవలం సాధారణ వ్యాధులే కాకుండా, అత్యవసర చికిత్సలో వాడే మందులను కూడా ప్రభుత్వం ఈ జాబితాలో చేర్చడం గమనార్హం. ముఖ్యంగా అవయవ మార్పిడి చేయించుకున్న రోగులు వాడే 'టాక్రోలిమస్ ప్రోలాంగ్డ్ రిలీజ్' క్యాప్సూల్ (3 mg) ధరను రూ. 127గా నిర్దేశించారు. ఇవే కాకుండా, ఎముకల వ్యాధి, పోషకాహార లోపాల నివారణకు వాడే విటమిన్ డి3 ఓరల్ సొల్యూషన్స్ వంటి వాటికి కూడా కొత్త ధరలను అమల్లోకి తెచ్చారు.

### అదనపు ధర వసూలు చేస్తే కఠిన చర్యలు

తయారీదారులు నిర్ణీత ధరల ప్రకారం ప్యాక్ ధరలను లెక్కించి, వాటిని ఇంటిగ్రేటెడ్ ఫార్మాస్యూటికల్ డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (IPDMS)లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దుకాణదారులు సవరించిన ధరల జాబితాను అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని ఎన్‌పిపిఎ ఆదేశించింది. ఒకవేళ నిర్ణయించిన ధర కంటే ఎక్కువ వసూలు చేస్తే, ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్, 1955 నిబంధనల ప్రకారం అదనపు మొత్తాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లించాల్సి ఉంటుందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.





మహా పత్రిక



ANN తెలుగు

WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | మంగళవారం, హైదరాబాద్ | 02-06-2026



# 9 గంటలకు మించి ఎప్పుడూ పనిచేయలేదు

సినిమా ఇండస్ట్రీలో 'పనిగంటలు' అనేవి గత కొన్నాళ్ల నుంచి హాట్ టాపిక్ అయిపోయాయి. టాలీవుడ్‌లో వర్కింగ్ టైం సెట్ కాకపోవడం వల్లే బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె.. స్పిరిట్, కల్కి 2898 ఏడీ సీక్వెల్ సినిమాలని వదులుకుందనే రూమర్స్ ఉన్నాయి. అయితే దీపికకు పరోక్షంగా కౌంటర్ ఇచ్చేలా ఇప్పుడు జాన్వీ కపూర్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. 'పెద్ది' ప్రమోషన్లలో భాగంగా జాన్వీ ఇలా స్పందించింది. 'బాలీవుడ్ కంటే టాలీవుడ్ వర్క్ కల్చర్ సూపర్. ఇక్కడ పనిగంటలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తారు. లంచ్ బ్రేక్‌లో అందరూ రెస్ట్ తీసుకుంటారు. తర్వాత రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తారు. నా వరకు నేను రోజుకు 9 గంటలకు మించి ఎప్పుడూ పనిచేయలేదు. అదే ముంబైలో అయితే ఒక్కో నిర్మాణ సంస్థ ఒక్కోలా పనిచేస్తుంది. అక్కడ పని గంటల విషయంలో కొన్నిసార్లు రాజీ పడాల్సి వస్తుంది. ఒక్కోసారి సమయపాలన సరిగా ఉండదు''రాత్రి షూటింగ్స్ విషయంలోనూ టాలీవుడ్‌లో స్పష్టమైన ప్లానింగ్ ఉంటుంది. తెలుగులో నైట్ షిఫ్ట్ ఉంటే కచ్చితంగా రాత్రి 2 గంటలకల్లా ప్యాకప్ చెప్పేస్తారు. దీనివల్ల అందరికీ తగినంత విశ్రాంతి దొరుకుతుంది. కానీ ముంబైలో పరిస్థితి వేరు. అక్కడ ఏ టైంకి షూటింగ్ పూర్తవుతుందో చెప్పలేం. టాలీవుడ్‌లో రోజుకు 12 గంటల పాటు పనిచేసిన సందర్భాలు చాలా తక్కువ. దాదాపు అన్ని రోజులు 9 గంటల్లోనే అయిపోయింది' అని జాన్వీ కపూర్ చెప్పింది.తెలుగులో ఎన్టీఆర్ సరసన 'దేవర' మూవీ చేసిన జాన్వీ కపూర్.. రామ్ చరణ్ సరసన 'పెద్ది' చేసింది. ఇది గనక హిట్ అయితే టాలీవుడ్‌లో ఈమెకు మరిన్ని అవకాశాలు రావడం గ్యారంటీ.



## సంగీత ప్రపంచంలో విషాదం..

# సింగర్ సుమన్ కన్నుమూత

ప్రముఖ గాయని సుమన్ కల్యాణ్‌పూర్ (89) ఇక లేరు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆమె ఆదివారం (మే 31న) సాయంత్రం ముంబైలోని తన నివాసంలో కన్నుమూశారు. చివరి రోజుల్లో ఆమె తన పాటలు వింటూ కాలం గడిపారు. గాయని మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు, సినీతారలు సంతాపం ప్రకటిస్తున్నారు.

### ఎవరీ గాయని?

సుమన్ కళ్యాణ్‌పూర్ 1937 జనవరి 28న ఢాకాలో జన్మించారు. 1950ల ప్రారంభంలో సంగీత ప్రస్థానాన్ని ప్రారంభించారు. మరాఠి, హిందీతో పాటు పలు భాషల్లోనూ పాటలు ఆలపించారు. నా నా కర్‌తే ప్యార్ తుమ్హీసే కర్ బైఠే.. (బాత్ ఏక్ రాత్ కీ మూవీ), ఆజ్ కల్ తేరే మేరే ప్యార్‌కే చర్చే హర్ జబాన్ పర్ (బ్రహ్మచారి), తుమ్నే పుకారా ఔర్ హమ్ చలే ఆయే (రాజ్‌కుమార్) వంటి ఎన్నో గీతాలకు ఆమె ప్రాణం పోశారు. ఆమె గొంతు లెజెండరీ సింగర్



లతా మంగేష్కర్‌ను పోలి ఉండటంతో అభిమానులు ఆమెను మరో లత అని పిల్చుకునేవారు. ఆరు దశాబ్దాలుగా సంగీత ప్రపంచానికి సేవలందించిన సుమన్‌ను భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది.



## కాజల్ వరుస ఫోటోషూట్స్..

# దానికోసమే ఇదంతా?

ఒక్కసారి డౌన్ అయితే మళ్లీ పైకి లేవడానికి సమయం పడుతుంది. ఒక్కోసారి అది కూడా జరగకపోవచ్చు. నయనతార వంటి సీనియర్ హీరోయిన్లు పెళ్లి తర్వాత కూడా తమ లెగసీని కొనసాగిస్తున్నారు. కాజల్ అగర్వాల్ వంటి కొందరు మాత్రం కెరీర్ పరంగా కాస్త ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నారు. కాజల్ ఇంతకుముందు పాన్ ఇండియా హీరోయిన్‌గా రాణించింది. తెలుగు, హిందీ, తమిళ భాషల్లో ప్రముఖ హీరోలతో జతకట్టిన ఈ ఉత్తరాది భామ 2020లో గౌతమ్ కిచ్లును పెళ్లాడింది. వీరికి ఒక బాబు కూడా జన్మించాడు.

### స్లిమ్ అయిన కాజల్

ఆ సమయంలో సినిమాలకు కొంత విరామం ఇచ్చిన కాజల్ ఇప్పుడు ఇండస్ట్రీలో మళ్లీ బిజీ అవాలని చూస్తోంది. అందుకే అనేక కసరత్తులు చేస్తూ స్లిమ్ అయిపోయింది. అయితే అవకాశాలు అరుదుగా వస్తున్నప్పటికీ గుర్తింపయితే రావట్లేదు. ఏడాదికి ఒకటి రెండు చిత్రాల్లోనే నటిస్తోంది కానీ బిజీగా మాత్రం లేదు. హిందీలో రామాయణం, ద ఇండియా స్టోరి మూవీస్ చేస్తోంది. కమల్ హాసన్ ఇండియన్ 3 ఎప్పుడు పూర్తవుతుందో, ఎప్పుడు తెరపైకి వస్తుందో తెలియని పరిస్థితి.

### అందుకోసమే కసరత్తులు

తాజాగా ఈ బ్యూటీ ఒక తెలుగు చిత్రంలో నటించే అవకాశాన్ని దక్కించుకుంది. ఇకపోతే పూర్వవైభవాన్ని పొందాలని తహతహలాడుతున్న ఈ బ్యూటీ తనను తాను ప్రచారం చేసుకునే పనిలో పడింది. గతకొద్దిరోజులుగా ప్రతిరోజూ ఫోటోషూట్ చేస్తూ ఆ ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తోంది. అవి నెట్టింట వైరలవుతుండగా అవకాశాల కోసమే ఈ ఫోటో సెషన్ అని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. మరి తన కష్టానికి తగ్గ ఫలితం దక్కుతుందో? లేదో? చూడాలి!

## కోలీవుడ్‌లో మళ్లీ బిజీ అయిపోయిన

# తెలుగింటి ఆడపడుచు



నటి ఐశ్వర్యరాజేశ్ ఆరణాల తెలుగింటి ఆడపడుచు అన్న విషయం తెలిసిందే. అయితే ఈమెను ముందుగా ఆదరించింది తమిళ సినిమానే. కాక్కా ముట్టై చిత్రానికి ముందు వరకు తనుకంటూ గుర్తింపు కోసం పోరాడిన ఐశ్వర్య రాజేశ్, ఆ చిత్రం తరువాత ఈమెను తమిళ చిత్ర పరిశ్రమ అంతా ప్రశంసలతో ముంచెత్తింది. అలా అంచెలంచెలుగా ఎదిగి ప్రముఖ కథానాయకిగా రాణిస్తున్నారు. ఆ మధ్య ఉమెన్ సెంట్రిక్ కథా చిత్రాల్లో నటించి పేరు తెచ్చుకున్నారు. ఆ తరువాత తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి అవకాశాలును అందుకున్నారు. అక్కడ వెంకటేష్ సరసన నటించిన సంక్రాంతికి వస్తున్నాం చిత్రం సంచలన విజయాన్ని సాధించింది. అలా తెలుగులో చిత్రాలు చేయడంతో కోలీవుడ్లో చిన్న గ్యాప్ వచ్చింది. కాగా ఇప్పుడు ఇక్కడ మళ్లీ బిజీ అవుతున్నారు. తాజాగా ఐశ్వర్య రాజేశ్ ప్రధాన పాత్రను పోషిస్తున్న అండర్-18 అనే క్రైమ్ థ్రిల్లర్ కథా చిత్రాల్లో నటిస్తున్నారు. ఇందులో ఆమె పోలీస్ అధికారిగా నటిస్తున్నట్లు సమాచారం. కన్నడ నటుడు కిచ్చా సుదీప్, విక్రాంత్ ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం ద్వారా దర్శకుడు వెట్రిమారన్ శిష్యుడు కార్తీక్ పెరుమాళ్‌స్వామి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎస్ఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై బి.జగదీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం శుక్రవారం చెన్నైలో పూజా కార్యక్రమాలను జరుపుకుంది. త్వరలోనే షూటింగ్‌ను ప్రారంభించనున్నట్లు యూనిట్ సభ్యులు మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మంచి కథ కోసం చాలా కాలం ఎదురుచూసినందుకు దక్కిన అవకాశం ఈ చిత్రం అని ఐశ్వర్య రాజేశ్ అన్నారు.

## రణ్‌వీర్ సింగ్‌ని కాదు... ఎఫ్‌డబ్ల్యూఐసీఈని

# బ్యాన్ చేయండి



''డాన్ 3' సినిమా వివాదంలో రణ్‌వీర్ సింగ్‌కు మద్దతుగా నిలిచారు దర్శక-నిర్మాత రామ్‌గోపాల్ వర్మ. రణ్‌వీర్ సింగ్ హీరోగా ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో 'డాన్ 3' ప్రకటన వచ్చిన సంగతి తెలిసిందే. ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభానికి మూడు వారాల ముందు ఈ ప్రాజెక్ట్ నుంచి రణ్‌వీర్ తప్పుకోవడంతో దాదాపు రూ. 45 కోట్ల నష్టం వాటిల్లిందని ఫర్హాన్ ఆరోపించారు. ఆ నష్టాన్ని భర్తీ చేయాలని 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్' (ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) యూనియన్‌కు రణ్‌వీర్‌పై ఫర్హాన్ ఫిర్యాదు చేశారు. ఈ విషయమై చర్చించేందుకు 'ఎఫ్‌డబ్లూఐసీఈ' ప్రతినిధులు రణ్‌వీర్ సింగ్‌కు మూడు సార్లు నోటీసులు పంపారు. అయితే సరైన స్పందన లేకపోవడంతో దాదాపు మూడేళ్ల పాటు రణ్‌వీర్ సినిమాల చిత్రీకరణలో పాల్గొనకూడదని, ఎఫ్‌డబ్ల్యూఐసీఈ తీర్మానించడం బాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. ఈ అంశంపై రామ్‌గోపాల్ వర్మ 'ఎక్స్' వేదికగా షేర్ చేసిన సుదీర్ఘ పోస్ట్ సారాంశం ఇలా... ''రణ్‌వీర్ సింగ్‌ని కాదు ఎఫ్‌డబ్ల్యూఐసీఈని నిషేధించండి. ఎఫ్‌డబ్ల్యూఐసీఈ అనేది ప్రభుత్వ గుర్తింపు పొందిన నియంత్రణ సంస్థ కాదు. చట్టపరమైన నిబంధనలను పక్కనపెట్టి కొందరు వ్యక్తులు ప్రైవేటుగా సమావేశమై, ఒక ఎజెండాతో ఈ తీర్పును ముందుగానే నిర్ణయించినట్లు ఉన్నారు. 'ధురంధర్' సినిమాతో రణ్‌వీర్ సింగ్ సాధించిన భారీ క్రేజ్ చూసి భయపడుతున్న కొందరు నటులు కూడా ఇందులో సభ్యులుగా ఉన్నట్లున్నారు. నిర్మాత ప్రీ ప్రొడక్షన్ వర్క్‌స్‌లో నష్టం జరిగిందని చెబుతున్నారు. భారతదేశంలో చాలా వ్యాపారాల్లో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే ఇలాంటి సివిల్ వివాదాలు చాలానే ఉన్నాయి. ఒకవేళ వారిలో ఒకరు లేదా ఇద్దరూ కోర్టును ఆశ్రయిస్తే అప్పుడు న్యాయమూర్తి ఆ విషయాన్ని తేలుస్తారు. నేను ఫైనల్‌గా చెప్పేది ఒకటే... ఇద్దరు వ్యక్తుల మధ్య నెలకొన్న సివిల్ వివాదంలోకి అనవసరంగా తలదూర్చవద్దు'' అంటూ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు రామ్‌గోపాల్ వర్మ.

# ఏఐ ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాదు

''సినిమా మేకింగ్‌లో సాంకేతికత పెరిగినప్పటికీ మనుషుల భావోద్వేగాలకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రత్యామ్నాయం కాదు... కాలేదు'' అని హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ పేర్కొన్నారు. ఇటీవల స్పీల్‌బర్గ్ సినిమా మేకింగ్‌లో కృత్రిమ మేధ వినియోగంపై చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ఆయన ఏం మాట్లాడారంటే... ''కళలో మానవీయ కోణం అన్నది ఎంతో ముఖ్యం. రచయితల టేబుల్ వద్ద ఒక కుర్చీ ఖాళీగా ఉండి ఆ స్థానాన్ని ఏఐ భర్తీ చేయడాన్ని నేను ఇష్టపడను. సొంతంగా ఆలోచించే లేదా అనుభవించే స్పృహ కంప్యూటర్లకు ఉంటుందని నేను నమ్మను. మానవ ఆత్మకు, వారి అంతర్గత సృజనాత్మకతకు ఏఐ ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాలేదు. సినిమా అనేది కొన్ని కమాండ్స్ సమాహారం కాదు. అది మానవ మేధస్సు, హృదయం నుండి వచ్చే అద్భుత సృష్టి. ఏఐని ఒక టూల్‌గా ఉపయోగించుకోవడానికి అభ్యంతరం లేదు. సినిమా షూటింగ్ కోసం అనువైన లొకేషన్లను వెతకడంలో ఏఐ సహాయం తీసుకుంటే ఓకే. అయితే సినిమా రంగంలో సృజనాత్మక ప్రక్రియకు సంబంధించిన ఏ విషయానికైనా ఏఐని తుది నిర్ణయంగా తీసుకో



కూడదని హాలీవుడ్‌ని కోరుతున్నాను. భవిష్యత్తులో నేను చేసే సినిమాలకు ఏఐ అనేది విరుద్ధం. నటీనటుల ఎంపిక, కెమెరాను ఏ కోణంలో పెట్టాలి? డైలాగులు ఎలా రాయాలి? వంటి సృజనాత్మక విషయాలను ఏఐ టూల్ నాకు సూచించడానికి నేను పూర్తి వ్యతిరేకం'' అని స్పీల్‌బర్గ్ పేర్కొన్నారు.

– స్టీవెన్ స్పీల్‌బర్గ్

OWNED BY N SREENIVAS RAO. EDITED, PRINTED AND PUBLISHED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com